
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
కృష్ణా జిల్లా వార్తలు
ఆదివారం 31 ఆగస్టు 2025




లాటరీ తీస్తున్న జేసీ గీతాంజలిశర్మ

30 బార్లు కేటాయింపు

లాటరీ తీసిన జేసీ గీతాంజలిశర్మ

మచిలీపట్నం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని 30 బార్లకు లాటరీ పద్ధతిన షాపులు కేటాయించారు. జిల్లాలోని 26 బార్లను, గీత కులాలకు కేటాయించిన నాలుగు బార్లను శనివారం కలెక్టరేట్‌లోని సమావేశపు హాల్లో లాటరీ తీసి కేటాయించారు. జేసీ గీతాంజలిశర్మ ఈ లాటరీ తీశారు. 26 బార్లకు 112 దరఖాస్తులు రాగా, వచ్చిన దరఖాస్తుల ఆధారంగా నెంబర్లు కేటాయించి లాటరీ తీశారు. గీతకులాలకు కేటాయించిన నాలుగు బార్లకు 39 దరఖాస్తులు రాగా, వాటిని లాటరీ తీసి నెంబర్లను ప్రకటించారు. లాటరీ పద్ధతిన బార్ల కేటాయింపు ప్రక్రియను కృష్ణా ఎక్సైజ్‌శాఖ సూపరింటెండెంట్ జి.గంగాధరరావు, అసిస్టెంట్ సూపరింటెండెంట్ భార్గవ్, బీసీ సంక్షేమశాఖ జేడీ జి.రమేశ్, ఎక్సైజ్ డివిజన్ స్థాయి అధికారులు పర్యవేక్షించారు. జిల్లాలో ఇంకా 13 బార్లకు దరఖాస్తులు రాలేదని, ప్రభుత్వం అనుమతులు ఇచ్చాక, వాటికి దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ఉంటుందని ఎక్సైజ్‌శాఖ అసిస్టెంట్ సూపరింటెండెంట్ భార్గవ్ తెలిపారు. లాటరీ పద్ధతి ద్వారా బార్లు దక్కించుకున్నవారు ప్రభుత్వం నిర్దేశించిన ఫీజులో 1/6వ వంతు నగదును చెల్లించిన వెంటనే అనుమతులు ఇవ్వడం జరుగుతుందన్నారు. సెప్టెంబరు 1 నుంచి నూతన బార్లను నడుపుకోవచ్చని చెప్పారు.

వేరుశెనగ విత్తనాలను వేరు చేశారు..!

620 క్వింటాళ్ల ఉచిత వేరుశెనగ విత్తనాలు పక్కదారి

బందరు మండలంలో పంట సాగుచేయని రైతుల పేరిట..

- ఇద్దరు నాయకుల ఇళ్లకు తరలించినట్టు ఆరోపణలు
- అసలు రైతులు ప్రశ్నించగా.. పేర్లే లేవని బుకాయింపు
- అనుమానాస్పదంగా వ్యవసాయ శాఖ అధికారుల తీరు
- ఆందోళనకు సిద్ధమవుతున్న అసలు రైతులు


నూనె గింజల ఉత్పత్తి కోసం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నేషనల్ మిషన్ ఆన్ ఎడిబుల్ ఆయిల్స్ (ఎన్ఎంఈవో) పథకం జిల్లాలో అభాసుపాలవుతోంది. ప్రభుత్వం ఉచితంగా ఇచ్చిన విత్తనాలను రైతులకు ఇవ్వకుండా గంపగుత్తగా పక్కదారి పట్టిస్తున్నారు. రైతులకు విత్తనాలు ఇచ్చినట్టుగా చూపి, కొంతమంది రైతులతో ఫొటోలు దిగి, ఆ తరువాత వాటిని ట్రాక్టర్లలో మండలానికి చెందిన ఇద్దరు ద్వితీయశ్రేణి నాయకులు తమ ఇళ్లకు తరలించుకుపోవడంతో విత్తనాలు అందని రైతులు ఆందోళనకు సిద్ధమవుతున్నారు.

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : నూనె గింజలకు సంబంధించి సాగు విస్తీర్ణం పెంచే కార్యక్రమంలో భాగంగా కేంద్రప్రభుత్వం ఎన్ఎంఈవో పథకాన్ని ప్రవేశపెట్టింది. రాష్ట్ర ప్రభుత్వం ఈ పేరును ఆంధ్రప్రదేశ్ స్టేట్ సీడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌గా మార్చింది. ఈ కార్యక్రమం అమల్లో భాగంగా జిల్లాలోని మచిలీపట్నం మండలాన్ని ప్రయోగాత్మకంగా వేరుశెనగ పంటసాగు నిమిత్తం ఎంపిక చేశారు. మండలానికి 620 క్వింటాళ్ల వశిష్ట వేరుశెనగ విత్తనాలను ఇటీవల మచిలీపట్నం మార్కెట్ యార్డులో దించారు. మచిలీపట్నం మండలంలోని ఒకట్రెండు గ్రామాల్లోని రైతుసేవా కేంద్రాల్లో వేరుశెనగ విత్తనాల పంపిణీ జరిగింది. విత్తనాలు రైతులకు ఇచ్చినట్లుగా హడావిడి చేశారు. కొద్దిమొత్తంలో విత్తనాలను అందజేసిన అనంతరం వాటిని మాయం చేశారు. మండలంలోని ఇద్దరు ద్వితీయశ్రేణి నాయకులు ట్రాక్టర్ల ద్వారా గుట్టుచప్పుడు మిగతా 6లో..


వేరుశెనగ విత్తనాలు

పథకం ఉద్దేశమిదీ..

నూనెగింజల సాగును పెంచి, విదేశాల నుంచి నూనె దిగుమతులను తగ్గించే కార్యక్రమంలో భాగంగా కేంద్రప్రభుత్వం ఈ ఎన్ఎంఈవో పథకాన్ని ప్రవేశపెట్టింది. ఆయా ప్రాంతాల్లో నూనెగింజల సాగు ఉత్పత్తి కోసం వివిధ రకాల పంటలను సాగు చేసేందుకు రైతులకు ప్రోత్సాహం ఇచ్చేలా, నూనె ఉత్పత్తికి సంబంధించిన విత్తనాలను ఉచితంగా అందించేలా ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. పథకం ఉద్దేశం బాగానే ఉన్నా.. ఉచితంగా వచ్చిన విత్తనాలను రైతులకు పూర్తిస్థాయిలో అందించకుండా, పక్కా ప్రణాళికతో దారి మళ్లించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇంతా జరిగినా మచిలీపట్నం మండల వ్యవసాయ శాఖ అధికారులు మిన్నకుండిపోవడం వెనుక కారణాలు ఏమై ఉంటాయనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పైగాపారదర్శకంగానే విత్తనాల పంపిణీ జరిగిందని జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు చెప్పడం విడ్డూరంగా ఉంది.



ఆశీర్వాద వినాయకుడు

మచిలీపట్నం సంతోష్ హోటల్ వద్ద మెకానిక్‌లు ఏర్పాటుచేసిన వినాయకుడు విభిన్నంగా దర్శనమిస్తూ అందరినీ ఆకట్టుకుంటున్నాడు. తొండం కదులుతుండగా, అభయహస్తంతో స్వామి భక్తులను ఆశీర్వదిస్తున్నట్టుగా వినూత్నంగా ఈ విగ్రహాన్ని రూపొందించగా, భక్తులు అధిక సంఖ్యలో వచ్చి దర్శించుకుంటున్నారు. - మచిలీపట్నం టౌన్



మత్తు కలిపింది ఇద్దరినీ..

ఇంటర్ కాలేజీలో డ్రగ్స్ అలవాటైన శ్రీవాత్సవ్

అవే అలవాట్లు ఉన్న అమ్మాయితో పరిచయం, ప్రేమ

- ఇద్దరూ డ్రగ్స్ కోసం బెంగళూరు పయనం
- అంతటితో ఆగకుండా విశాఖపట్నానికి సరఫరా
- బస్సు విజయవాడ రాగానే పట్టుకున్న పోలీసులు
- ఎండీఎంఏతో పాటు ఎల్ఎస్‌డీ డ్రగ్ స్వాధీనం
- విశాఖపట్నం ప్రేమజంట కేసులో కొత్త కోణాలు
- ప్రేమికులిద్దరికీ వచ్చేనెల 13 వరకు రిమాండ్

(ఆంధ్రజ్యోతి-విజయవాడ) : వైజాగ్‌కు చెందిన అర్జాల శ్రీవాత్సవ్, బొడ్డేపల్లి హవీల డిలైట్.. 19 గ్రాముల ఎండీఎంఏతో పాటు ఎల్ఎస్‌డీ డ్రగ్‌ను ఈగల్ బృందం పట్టుకుని మాచవరం పోలీసులకు అప్పగించిన విషయం తెలిసిందే. ఈ ఇద్దరినీ పోలీసులు ఒకటో ఏసీఎంఎం కోర్టులో శనివారం హాజరుపరచగా, 13వ తేదీ వరకు రిమాండ్ విధించారు. ఈ ఇద్దరి వద్ద ఎండీఎంఏతో పాటు ఎల్ఎస్‌డీ డ్రగ్‌కు సంబంధించిన పేపర్లు లభించాయి. వాటిని నాలుకపై పెట్టుకుని చప్పరిస్తే కిక్ ఎక్కుతుంది. ఈ రెండు డ్రగ్స్‌ను శ్రీవాత్సవ్, హవీల మిగతా 6లో..

పశువైద్యశాల భవనం శిథిలం

- గుడివాడ ఆసుపత్రిలో పెచ్చులూడిన శ్లాబు, పగుళ్లిచ్చిన పిల్లర్లు
- భయంభయంగా సిబ్బంది విధులు
- వైసీపీ ప్రభుత్వ నిర్వాకంతో మురిగిపోయిన నిధులు
- స్పందించాలని వినతి

6



పర్యాటకం ప్రైవేట్‌కు..

విజయవాడ డివిజన్ యూనిట్లన్నీ కట్టబెట్టే ప్రయత్నాలు

రూ.10 కోట్ల వార్షికాదాయం వచ్చే పర్యాటక యూనిట్లను రూ.4.50 కోట్లకు 33 ఏళ్ల పాటు ఎవరైనా ప్రైవేట్ సంస్థలకు కట్టబెడతారా? ఘనత వహించిన టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీటీడీసీ) అధికారులు ఇప్పుడదే చేస్తున్నారు. అతి తక్కువకు పర్యాటక యూనిట్లను కట్టబెట్టడంతో పాటు కేవలం 4 శాతం కడితే నెలరోజుల్లో అప్పగించేస్తామన్న బంపర్ ఆఫర్ కూడా ఇచ్చారు. పర్యాటక శాఖ ఎండీ, చైర్మన్లు కాదంటున్నా.. ఉద్యోగులు ఆందోళన చేస్తున్నా.. పట్టించుకోకుండా పర్యాటక శాఖ కార్యదర్శి అజయ్‌జైన్ తీసుకున్న ఈ నిర్ణయంపై అనేక ఆరోపణలు వస్తున్నాయి.

- రూ. 10 కోట్ల ఆదాయమిచ్చేవి రూ. 4.50 కోట్లకే..
- బరంపార్కు, భవానీద్వీపం, సూర్యలంక బీచ్ రిసార్ట్స్, సాగర్ విజయపురి సౌత్ హోటళ్లు, బార్ అండ్ రెస్టారెంట్లు..
- ప్రైవేట్‌కు అప్పగించేందుకు ఆర్ఎఫ్‌పీ విడుదల చేసిన ఏపీటీడీసీ
- పర్యాటక శాఖ సెక్రటరీ అజయ్‌జైన్ అత్యుత్సాహం
- ఎండీ, చైర్మన్లు వ్యతిరేకిస్తున్నా పట్టించుకోకుండా నిర్ణయం

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : విజయవాడ డివిజన్ పరిధిలోని మూడు జిల్లాల్లోని ఆరు పర్యాటక యూనిట్లను గంపగుత్తగా ప్రైవేట్ సంస్థ చేతుల్లో పెట్టేందుకు పర్యాటకాభివృద్ధి సంస్థ (ఏపీటీడీసీ) రిక్వెస్ట్ ఫర్ ప్రపోజల్స్ (ఆర్ఎఫ్‌పీ)ను విడుదల చేసింది. వస్తున్న ఆదాయానికి భిన్నంగా కారుచౌకగా ప్రైవేట్ సంస్థకు లీజుకిచ్చేలా నోటిఫికేషన్ ఇవ్వటంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. డివిజన్ పరిధిలోని ఎన్టీఆర్ జిల్లాలో హరిత బెర్మ్‌పార్క్, భవానీ ద్వీపం, బాపట్ల జిల్లాలోని సూర్యలంక బీచ్ రిసార్ట్స్, పల్నాడు జిల్లా పరిధిలోని ఎత్తిపోతల హరిత హోటల్, నాగార్జున సాగర్, విజయపురి సౌత్ హరిత హోటల్, ధ్యానబుద్ధ ప్రాజెక్టులను రూ.4.50 కోట్ల అతి తక్కువ రెవెన్యూ షేర్‌తో ప్రైవేట్ సంస్థలను ఆహ్వానించింది. వీటన్నింటినీ వేర్వేరుగా కాకుండా గంపగుత్తగా ప్రైవేటుకు మిగతా 6లో..

లాభాల్లో ఉన్నప్పటికీ..

విజయవాడలోని హరిత బరం పార్కు ద్వారా ఏడాదికి రూ.4 కోట్ల ఆదాయం వస్తోంది. భవానీ ద్వీపం ద్వారా రూ.2 కోట్ల ఆదాయం వస్తోంది. సూర్యలంక బీచ్ రిసార్ట్స్ ద్వారా రూ.3 కోట్ల ఆదాయం వస్తోంది. మిగిలిన ప్రాజెక్టుల ద్వారా రూ.కోటి ఆదాయం వస్తోంది. ఇక్కడే రూ.10 కోట్ల లెక్క తేలుతుండగా, రూ.4.50 కోట్లకు ప్రైవేట్ సంస్థకు ఇవ్వాల్సిన అవసరం ఏమిటన్నది ఉన్నతాధికారులకే తెలియాలి.


భవానీ ద్వీపం

ఉద్యోగుల మెడపై కత్తి

ఏపీటీడీసీలో పనిచేసే ఉద్యోగుల భద్రత కూడా ప్రశ్నార్థకంగా చేశారు. పాతికేళ్ల కిందట ఉద్యోగులకు అనేక పరీక్షలు పెట్టి, ఇంటర్వ్యూలు నిర్వహించి తీసుకోగా, వారికి పర్యాటకంపై శిక్షణ కల్పించాలని, తరచూ పరీక్షలు నిర్వహించాలని నిర్దేశించారు. ఈ పేరుతో పరీక్షల్లో పాస్ కాలేదని ప్రైవేట్ సంస్థ వారిని ఉద్యోగాల నుంచి తొలగించే అవకాశం కల్పించారు.

బ్యాంకులో తాకట్టు పెట్టిన ఆస్తిని లీజుకిస్తారా?

హరిత బరం పార్కును రూ.150 కోట్లకు రామవరప్పాడులోని ఎస్‌బీఐలో తాకట్టు పెట్టారు. వచ్చిన డబ్బుతో కాటేజీల రెన్నోవేషన్ పనులకు టెండర్లు పిలిచారు. రూ.90 కోట్ల వరకు రెన్నోవేషన్ పనులు చేపట్టి పనులను మధ్యలోనే రద్దు చేశారు. మరో రూ.60 కోట్ల పనులు నిలిచిపోయాయి. ఈ నేపథ్యంలో బ్యాంకులో తనఖా ఉన్న ఆస్తిని ప్రైవేట్ సంస్థకు కట్టబెట్టే అధికారం ఏపీటీడీసీకి ఎలా ఉంటుందన్నది ప్రశ్నార్థకంగా మారింది.

జ్వర జాగ్రత్త..!

గుడివాడలో పారిశుధ్య నిర్వహణాలోపం

- రోజురోజుకూ పెరుగుతున్న జ్వర పీడితులు
- కిటకిటలాడుతున్న ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులు
- రోజుకు 2 వేలకు పైగా కేసుల నమోదు
- పారిశుధ్య నిర్వహణలో మున్సిపాలిటీ విఫలం

గుడివాడ పట్టణంలో పారిశుధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. అంతర్గత డ్రెయిన్లలో మురుగు నీరు పారుదల లేక దోమలకు ఆవాస కేంద్రాలుగా మారుతున్నాయి. పారిశుధ్య కార్మికుల కొరత, నిర్వహణకు అవసరమైన సామగ్రిని మున్సిపల్ అధికారులు ఏర్పాటు చేయడంలో నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నారు. ఇప్పటికే జ్వరబాధితులతో ఆసుపత్రులన్నీ కిటకిటలాడుతున్నాయి. డెంగీ మహ్మమారి పంజా విసిరేందుకు సిద్ధంగా ఉంది.


ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో రోగులు

ఆంధ్రజ్యోతి-గుడివాడ : గుడివాడ పట్టణంలోని అంతర్గత డ్రెయిన్లు అధ్వానంగా తయారయ్యాయి. మురుగునీరు కదలకపోవడంతో డ్రెయినేజీలు దోమలకు ఆవాసంగా మారాయి. దీంతో పలు ప్రాంతాల్లో టైఫాయిడ్, విషజ్వరాలు విజృంభిస్తున్నాయి. దోమల వ్యాప్తితో ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారు. పలు మార్లు స్థానికులు ఫిర్యాదు చేసినా పట్టించుకునే నాథుడు లేడు.


గుడివాడలోని ఓ డ్రెయినేజీలో కదలని మురుగు

శివారు ప్రాంతాలను వదిలేశారు

శివారు ప్రాంతాలతో పాటు పలు కాలనీల్లో పారిశుధ్య నిర్వహణ అధ్వానంగా ఉందని స్థానికులు మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకొచ్చినా పట్టించుకున్న దాఖలాలు లేవు. దోమల నివారణకు డ్రెయిన్లలో మలాథిన్ పిచికారీ చేయట్లేదు. ముందస్తు జాగ్రత్తలు కూడా మిగతా 6లో..

నైపుణ్యంతో ఐటీ కొలువులు

ఎన్టీఆర్ వికాసతో నిరుద్యోగులకు చేయూత

- 8 నెలల్లో 1,500 మందికి ఉపాధి
- ప్రతి వారం ఇంటర్వ్యూలు, ఉద్యోగాలు
- అందరూ వికాసను వినియోగించుకోండి: వికాస ప్రాజెక్ట్ డైరెక్టర్ లచ్చారావు

8

దాడి కేసుకు కులం రంగు!

- తోట్లవల్లూరు పోలీస్‌స్టేషన్ వద్ద ఎస్సీల ఆందోళన
- గోపీపై ఫిర్యాదు
- ఎస్సైను సస్పెండ్ చేయాలని డిమాండ్



రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నుంచి ఎమినెన్స్ అవార్డు అందుకుంటున్న బీహెచ్ఇఎల్ సీఎండీ కొప్పు సదాశివమూర్తి

సదాశివమూర్తికి స్కోప్ ఎమినెన్స్ అవార్డు

● ఎమ్మెల్యే తాతయ్య, శ్రీరాం సుబ్బారావు అభినందన

జగ్గయ్యపేట, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : జగ్గయ్యపేటకు చెందిన బీహెచ్ఈఎల్ సీఎండీ కొప్పు సదాశివమూర్తికి పరిశోధన, అభివృద్ధి, నూతన అవిష్కరణల విభాగంలో కేంద్ర ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక స్కోప్ ఎమినెన్స్ అవార్డు లభించింది. దిల్లీలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా సదాశివమూర్తి అవార్డు అందుకున్నారు. సదాశివమూర్తి బీహెచ్ఇఎల్‌లో వివిధ స్థాయిలలో పనిచేసి 2023 జూలైలో సీఎండీగా బాధ్యతలు చేపట్టారు. బీహెచ్ఇఎల్‌కు ప్రతిష్ఠాత్మక అవార్డును సాధించడంలో కృషి చేసిన సదాశివమూర్తిని ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య, మాజీ చైర్మన్ శ్రీరాం సుబ్బారావు తదితరులు అభినందించారు.

వీఆర్‌కు జంక్షన్ సీఐ, ఆత్కూరు ఎస్సై

మచిలీపట్నం క్రైమ్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : విధి నిర్వహణలో అలసత్వం చూపిన గన్నవరం సబ్ డివిజన్ పరిధిలోని ఎస్సై, సీఐలపై వేటు పడింది. ఆత్కూరు ఎస్సై చావా సురేష్, హనుమాన్ జంక్షన్ సీఐ సత్యన్నారాయణలను వీఆర్‌కు పంపుతూ ఎస్పీ ఆదేశాలు జారీ చేశారు.

ఆత్కూరు ఎస్సై గన్నవరం-2 ఎస్సై లక్ష్మీ నరసింహ మూర్తి బాధ్యతలు తీసుకోగా, హనుమాన్ జంక్షన్ సీఐగా ప్రస్తుతం గన్నవరం సీఐగా బాధ్యతలు నిర్వహిస్తున్న శివప్రసాద్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. గోవులతో వెళ్తున్న లారీని గోసంరక్షణ సమి తి నేతలు పొట్టిపాడు టోల్ గేట్ వద్ద ఆపి ఆత్కూరు పోలీసులకు అప్పగించారు. గోవులను గోశాలకు తరలించే క్రమంలో గో సంరక్షణ సమితి నాయకులకు, ఆత్కూరు ఎస్సై చావా సురేష్‌కు మధ్య వాగ్వాదం జరిగింది. గోసంరక్షణ సమితి నాయకులు ఎస్సైపై ఉన్న తాధికారులకు ఫిర్యాదు చేసినట్టు సమాచారం.

పశువైద్యశాల భవనం శిథిలం

● పెచ్చులూడిన శ్లాబు, పగుళ్లిచ్చిన పిల్లర్లు ● భయం..భయంగా సిబ్బంది విధులు
● వైసీపీ ప్రభుత్వ నిర్వాకంతో మురిగిపోయిన నిధులు ● కూటమి ప్రభుత్వం స్పందించాలని వినతి

ఎన్నో ఏళ్లుగా గుడివాడ పరిసర ప్రాంతంలోని పశువులకు వైద్యం అందించిన రావి భద్రయ్య మెమోరియల్ బహుళార్థ పశువైద్యశాల శిథిలావస్థకు చేరుకుంది. పెచ్చులు ఊడి, పిల్లర్లు పగిలి భీతిగొల్పుతుండడంతో సిబ్బంది విధులను భయం భయంగా నిర్వర్తిస్తున్నారు. 2014-19 టీడీపీ ప్రభుత్వ హయాంలో రూ.4 కోట్లు నిధులు మంజూరైనా, గత వైసీపీ ప్రభుత్వంలో నిర్లక్ష్యానికి గురవ్వడంతో మురిగిపోయాయి. కూటమి ప్రభుత్వం దృష్టి సారించి నూతన భవన నిర్మాణానికి నిధులను మంజూరు చేయాలని రైతులు కోరుతున్నారు.



శ్లాబు పెచ్చులూడి, పిల్లర్లు పగిలిపోయిన భవనంలో విధులు నిర్వహిస్తున్న రావి భద్రయ్య మెమోరియల్ బహుళార్థ పశువైద్యశాల సిబ్బంది

(ఆంధ్రజ్యోతి - గుడివాడ)

గుడివాడలోని రావి భద్రయ్య మెమోరియల్ బహుళార్థ పశువైద్యశాల భవన దుస్థితి దారుణంగా ఉంది. భవనం పాతది కావడంతో పెచులూడిపడుతున్నాయి. పిల్లర్లు పగిలిపోయాయి. వైద్యశాలకు రావాలంటే పశుపోషకులు భయపడిపోతున్నారు. ఏ సమయంలో ఏ ప్రమాదం జరుగుతుందో అనే భయంతో వైద్యులు, ఉద్యోగులు భయం భయంగా విధులు నిర్వహిస్తున్నారు.

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో పశువైద్యశాలను పూర్తి స్థాయిలో ఆధునీకరించి, నూతన భవనాలు, అధునాతన సదుపాయాలను ఏర్పాటు చేయాలనే ఉద్దేశ్యంతో రూ.4కోట్లు నిదులు మంజూరు చేసింది. పశువైద్యశాల చుట్టూ కొంత స్థలాన్ని వైద్యశాలకు ఇస్తే, విస్తరించి నిర్మాణం చేపట్టాలని టీడీపీ ప్రభుత్వం ఆలోచన చేసింది. ఎన్నికలు రావడం, వైసీపీ అధికారంలోకి రావడంతో నిధులు మురిగిపోయాయి. టీడీపీ హయాంలో మంజూరైన ఏ పనులనూ చేయకూడదని అప్పటి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఆదేశాలతో నూతన భవన నిర్మాణం అటకెక్కింది. మాజీ మంత్రి కొడాలి నాని, అప్పటి గుడివాడ మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు నూతన భవన నిర్మాణానికి సహకరించకపోవడంతో రూ.4కోట్లు నిధులు మురిగిపోయాయి.

కూటమి ప్రభుత్వంపైనే ఆశలు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో నూతన భవన నిర్మాణ పనులకు నిధులు మంజూరవుతాయని పశుపోషకులు ఆశగా ఎదురుచూస్తున్నారు. కూటమి ప్రభుత్వంలో నిధులు తెచ్చి నూతన భవనాన్ని నిర్మించేందుకు ఎమ్మెల్యే వెనిగండ్ల రాము దీనిపై దృష్టి సారించారు. ఈ దిశగా అడుగులు వేస్తున్నారు.



భవిష్యత్ భద్రతా దళం వినతి

భవనం ఏ క్షణంలోనైన కూలిపోయే దశలో ఉందని, ప్రస్తుత భవనంలో కార్యకలాపాలు నిర్వహించకుండా నిలుపుదల చేయాలని భవిష్యత్ భద్రతా దళం వ్యవస్థాపకులు వై.వి మురళీకృష్ణ కోరారు. గత కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు పరిస్థితి దారుణంగా తయారైందన్నారు. వెంటనే భవనాన్ని తొలగించి నూతన భవనాన్ని నిర్మించాలని మురళీకృష్ణ కోరారు.



దుర్గమ్మ సన్నిధిలో మంత్రి కొల్లు రవీంద్ర

ఇంద్రకీలాద్రి, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : దుర్గామల్లేశ్వర దేవస్థానంలో కనకదుర్గమ్మను శనివారం రాత్రి మంత్రి కొల్లు రవీంద్ర దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ఆయనకు స్వాగతం పలికి అమ్మవారి దర్శనం కల్పించారు. అనంతరం వేద పండితులు ఆశీర్వచనాలు అందజేశారు. ఏఈవో ఎన్.రమేష్ బాబు ఆధ్వర్యంలో అర్చకులు మంత్రి రవీంద్రకు అమ్మవారి చిత్రపటం, లడ్డూ ప్రసాదం, శేషవస్త్రం అందజేశారు.



వరద తగ్గుముఖం

అవనిగడ్డ రూరల్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : ప్రకాశం బ్యారేజీ నుంచి దిగువకు విడుదల చేస్తున్న వరద నీరు క్రమేపీ తగ్గుతోంది. శనివారం 2.80 లక్షల క్యూసెక్కుల వరద నీటిని దిగువకు విడుదల చేసినట్లు అధికారులు తెలిపారు. పులిగడ్డ ఆక్విడెక్ట్ వద్ద వరద ప్రవాహం కొనసాగుతోంది.





కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న కౌన్సిలర్ మనోహర్, వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, కౌన్సిలర్ రామలక్ష్మి

పేటలో సూరత్ తరహా సెన్సార్స్ నీటి సరఫరా వ్యవస్థ

● ప్రయోగాత్మకంగా అమలుకు కౌన్సిల్ ఆమోదం

జగ్గయ్యపేట, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : నీటి సరఫరా వ్యవస్థను సెన్సార్స్, రోబోటిక్ సాయంతో నిర్వహించేందుకు ప్రాజెక్టును రూపకల్పన చేస్తున్నట్టు మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర చెప్పారు. కౌన్సిల్‌హాలు లో శనివారం నిర్వహించిన సమావేశంలో చైర్మన్ నూతన విధానాన్ని కౌన్సిలర్లకు వివరించారు. సూరత్ కార్పోరేషన్‌లో రిజర్వాయర్‌లు, సంపులు, వాల్వ్‌ల ఆపరేషన్ మొత్తం సెన్సార్స్, రోబోటిక్ విధానంలో నిర్వహిస్తున్నారని, అదే విధానం అమలు చేసేందుకు హైదరాబాద్‌కు చెందిన సాంకేతిక నిపుణుల బృందంతో అధ్యయనం చేయించామన్నారు. అధునాత వ్యవస్థ ఏర్పాటుకు రూ.30 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు వ్యయం అవుతుందన్నారు. ఒకసారి పెట్టుబడితో నిర్వహణ వ్యయం తగ్గుతుందని వివరించారు. పురపాలక సంఘం మంచి నీటి సరఫరా విభాగంలో 12 మంది వాల్వ్ ఆపరేటర్లు పనిచేస్తున్నారని చెప్పారు. దీర్ఘకాలంలో పెట్టిన ఖర్చు వెనక్కి రావటంతో పాటు ప్రజలకు సంతృప్తికరంగా, నిర్దిష్ట సమయాల్లో మంచినీటి సరఫరా చేయవచ్చన్నారు. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరుకు కృషి చేస్తామని చెప్పారు. మంచినీటి సరఫరా లోపాలకు సిబ్బంది బాధ్యతారాహిత్యం, వైఫ ల్యం కూడా కారణమని కౌన్సిల్ సభ్యులు పేర్కొన్నారు. ఈ విధానంపై పూర్తిగా అధ్యయనం చేసి రూ.5 నుంచి రూ.10 లక్షలతో ప్రయోగాత్మకంగా అమలు చేసేందుకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది.

ఆక్రమణలపై కౌన్సిలర్ రామలక్ష్మీ ఆగ్రహం

పదో వార్డులో మఠం రోడ్డులో ఆక్రమణలపై కౌన్సిలర్ కన్నె బోయిన రామలక్ష్మీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చే శారు. రైతుబజార్ నుంచి మఠం రోడ్డుకు వేసిన సిమెంటు రోడ్డును తుక్కు వ్యాపారులు ఆక్రమించి వ్యాపారం చేస్తున్నారని, రోడ్డుపై బండ్లు పెట్టి అమ్ముతున్నారని, విచ్చలవిడిగా ప్లాస్టిక్ కవర్లు వాడుతున్నారని ఆమె చెప్పారు. ప్లాస్టిక్ నిషేధం ఏమైందని ప్రశ్నించారు. స్వచ్ఛాంధ్ర పేరుతో ర్యాలీలు చేస్తే సరిపోతుందా అని అధికారులను నిలదీశారు. టౌన్ ప్లానింగ్ అధికారులు, సచివాలయ అధికారులు ఏమి చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

అధికారులు వైఫల్యంపై కౌన్సిలర్ల ఆగ్రహం

ఆర్టీసీ కాలనీలో 20 రోజులగా మంచినీటి సరఫరా నిలిచిపోయినా అధికారులకు చీమకుట్టినట్టు కూడా లేదని, ఎంపీ నిధులతో వచ్చిన వాటర్ ట్యాంకర్లతో కూడా నీరు సరఫరా చేయలేదని చైర్మన్ రాఘవేంద్ర , వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, కౌన్సిలర్ వట్టెం మనోహర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. జంగిల్ క్లియరెన్స్ పేరుతో చేసిన విధ్వంసం వల్ల పైపులైన్ దెబ్బతిందని ఆరోపించారు. అధికారుల తీరు మారటం లేదన్నారు.

కౌన్సిలర్లు మనోహర్, నాగరాజు వాకౌట్

అధికారుల తీరుకు నిరసనగా ప్రతిపక్ష కౌన్సిలర్ వ ట్టెం మనోహర్ వాకౌట్ చేశారు. తన వార్డులో కనీస పనులు జరగ లేదని, తన వేదన అరణ్య రోదన అవుతోందన్నారు. కౌన్సిల్‌లో మాట్లాడేందుకు చైర్మన్ అవకాశం ఇవ్వటం లేదంటూ సమావేశం నుంచి వాకౌట్ చేశారు.

పాలకపక్ష కౌన్సిలర్ గొట్టే నాగరాజు మాట్లాడుతూ తన వార్డులలో ఆర్నెల్ల క్రితం శంకుస్థాపన చేసిన రోడ్డు పనులు పూర్తి చేయలేదంటూ సమావేశం నుంచి వాకౌట్ చేశారు.

బ్లాక్‌మార్కెట్‌కు యూరియాపై విచారణ

● ఆంధ్రజ్యోతి కథనానికి ఎన్టీఆర్ కలెక్టర్ లక్ష్మీశ స్పందన
● ఎరువుల దుకాణాల తనిఖీ
● రైతుల స్టేట్‌మెంట్ నమోదు



ఎ.కొండూరులోని ఎరువుల వ్యాపారి మిల్లులో అక్రమంగా నిల్వ చేసిన 85 డీఏపీ బస్తాలు

ఎ.కొండూరు, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : బ్లాక్ మార్కెట్‌కు యూరియా శీర్షికన ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ స్పందించి విచారణకు ఆదేశించారు. మార్క్‌ఫెడ్ డీఎం. కె. నాగమల్లిక, ఎ.కొండూరు తహసీల్దార్ కె.లక్ష్మి, తిరువూరు సీఐ గిరిబాబు, ఎస్సై కృష్ణ శనివారం విచారణ నిర్వహించారు. ఆగస్టు 6న ఎ.కొండూరు రైతు సేవా కేంద్రానికి 15 టన్నుల యూరియా, 10 టన్నుల డీఏపీ, ఆగస్టు 10న చీమలపాడు రైతు సేవా కేంద్రానికి 15 టన్నుల యూరియా, రామచంద్రాపురం రైతు సేవా కేంద్రానికి 10 టన్నుల యూరియా మొత్తం 40 టన్నుల యూరియా, 10 టన్నుల డీఏపీ సరఫరా అయినట్టు మార్క్‌ఫెడ్ డీఎం కె. నాగమల్లిక తెలిపారు. ఈ ఎరువులు ఎక్కడకు వెళ్లాయి, రైతులకు ఎలా విక్రయించారు, ఎంత ధరకు అమ్మకాలు చేశారనే విషయాలపై విచారణ నిర్వహించారు. రైతు సేవా కేంద్రాలకు గోడెన్‌ను సౌకర్యం లేనందున ప్రైవేట్ డీలర్లకు సరఫరా చేసినట్టు ఏవో బి.సాయిశ్రీ తెలిపారు. తమకు యూరియా అందలేదని, రైతు సేవా కేంద్రాల ద్వారా సరఫరా చేయలేదని, బ్లాక్ మార్కెట్‌లో రూ. 300 నుంచి రూ.350 వరకు కొనుగోలు చేసినట్టు చీమలపాడు రైతులు వ్రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. రెవెన్యూ సిబ్బంది రామచంద్రాపురం, చీమలపాడు, ఎ.కొండూరు విలేజీ వ్యవసాయాధికార్లు, రైతుల నుంచి వ్రాతపూర్వకంగా స్టేట్‌మెంట్ తీసుకొన్నారు. ఎ.కొండూరులో ఎం.ఉమా అనే ఎరువుల వ్యాపారి గోడెన్‌ను అధికార్లు తనిఖీ చేయగా 85 డీఏపీ, 19:19:19 ఎరువు 25 బస్తాల అక్రమ నిల్వలను గుర్తించారు. చీమలపాడులోని మూడు ఎరువుల షాప్‌లు, రామచంద్రాపురంలో ఒక ఎరువుల షాప్‌ను అధికార్లు తనిఖీ చేశారు. పూర్తిస్థాయి విచారణ అనంతరం నివేదికను కలెక్టర్‌కు పంపుతామని తహసీల్దార్ కె.లక్ష్మి తెలిపారు. జిల్లా వ్యవసాయ అధికారి విజయకుమారి, విజిలెన్స్ ఏవో కిరణ్ కుమార్, ఎస్సై కృష్ణసాయి, హెడ్ కానిస్టేబుల్ గోపాలరావు పాల్గొన్నారు.



రైతులను విచారిస్తున్న మార్క్‌ఫెడ్ డీఎం నాగమల్లిక, తహసీల్దార్ లక్ష్మి

సీపీఎం ఆందోళన : ఎరువులు బ్లాక్ మార్కెట్‌కు తరలడాన్ని నిరసిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో ఎ.కొండూరు రైతు సేవా కేంద్రం వద్ద ఆందోళన నిర్వహించారు. సీపీఎం మండల కార్యదర్శి ఆనందరావు మాట్లాడుతూ రైతులకు సకాలంలో యూరియా, డీఏపీ అందజేయాలని, 50 టన్నుల యూరియాను పక్కదారి పట్టించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ తహసీల్దార్ కె.లక్ష్మికి వినతిపత్రం అందజేశారు. నేతలు వెంకటేశ్వరావు, అమ్మిరెడ్డి, శ్రీను, సుందరయ్య, నారాయణ, లక్ష్మయ్య, యోహన్, రాము పాల్గొన్నారు.

మత్తు కలిపింది ఇద్దరినీ..

(5వ పేజీ తరువాయి)

వద్ద స్వాధీనం చేసుకున్నారు.

డ్రగ్స్ కలిపిన ప్రేమ

విశాఖపట్నం మురళీనగర్ ఎన్జీవో కాలనీ ఆర్ఆర్ఆర్ గార్డెన్‌కు చెందిన అర్జాల శ్రీవాత్సవ్ తండ్రి నావికాదళంలో పనిచేస్తున్నాడు. అక్కడే మెకానికల్ నాల్గో సంవత్సరం చదువుతున్నాడు. 15 ఏళ్ల వయస్సు నుంచి శ్రీవాత్సవ్‌కు సిగరెట్, మద్యం తాగే అలవాటు ఉంది. ఇంటర్ చదువుతున్నప్పుడు స్నేహితుల నుంచి గంజాయి, డ్రగ్స్ అలవాటు చేసుకున్నాడు. ఇంటర్‌లో లోహిత్ యాదవ్ అనే యువకుడితో శ్రీవాత్సవ్‌కు స్నేహం కుదిరింది. అతడు తరచూ డ్రగ్స్ తీసుకునేవాడు. లోహిత్ యాదవ్ నుంచి డ్రగ్స్‌ను తీసుకోవడం మొదలుపెట్టాడు. ఇంతకుముందు డ్రగ్స్‌తో శ్రీవాత్సవ్ విశాఖ మూడో పట్టణ పోలీసులకు చిక్కగా కేసు నమోదైంది. ఏడాది క్రితం విశాఖకు చెందిన బొడ్డేపల్లి హవీల డిలైట్‌తో అతనికి పరిచయం ఏర్పడింది. ఆమె తమ్ముడి ద్వారా ఏర్పడిన స్నేహం ప్రేమగా మారింది. ఇద్దరికీ డ్రగ్స్ తీసుకునే అలవాటు ఉండటంతో ఆ ప్రేమ మత్తుగా మారింది. శ్రీవాత్సవ్ మాదిరిగానే హవీల సిగరెట్, మద్యం తాగడంతో పాటు డ్రగ్స్ తీసుకుంటుంది. విశాఖపట్నం సీబీఎం కాంపౌండ్ ప్రీమియర్ ప్యారడైజ్ ప్రాంతానికి చెందిన బొడ్డేపల్లి హవీల తండ్రి శామ్యూల్ సివిల్ ఇంజనీర్. ఆమె గడిచిన ఏడాది నాగపూర్‌లోని ఐఐఎంలో ఎంబీఏ పూర్తిచేసింది. తర్వాత పూణెలో బీడీఎం (బిజినెస్ డెవలప్‌మెంట్ మేనేజర్)గా మూడు నెలలు పనిచేసింది. తర్వాత ఉద్యోగం మానేసి వైజాగ్ వెళ్లిపోయింది. సివిల్ ఇంజనీర్‌గా ఉన్న తండ్రికి సహాయకురాలిగా ఉంటోంది. ఎంబీఏ చదువుతున్నప్పుడే స్నేహితుల ద్వారా సిగరెట్, మద్యం తాగడం, డ్రగ్స్ తీసుకోవడం అలవాటు చేసుకుంది. వైజాగ్‌కు వచ్చాక తన తమ్ముడు ద్వారా శ్రీవాత్సవ్‌తో పరిచయం ఏర్పడింది. శ్రీవాత్సవ్, హవీలకు ఒకే అలవాట్లు ఉండటంతో ఇద్దరి మధ్య బంధం బలపడింది. ఇద్దరూ కలిసి వైజాగ్‌లో ఎండీఎంఏ డ్రగ్ తీసుకున్నారు.

మాన్‌సూన్ 'బ్లాస్ట్' అయింది

శ్రీవాత్సవ్‌తో పాటు మరికొంతమంది స్నేహితులు గోవాలో 'మాన్‌సూన్ బ్లాస్ట్' పేరుతో మ్యూజికల్ ఫెస్టివల్ ఏర్పాటు చేసుకున్నారు. ఇందులో పాల్గొనడానికి శ్రీవాత్సవ్ ఈనెల 14న విశాఖ నుంచి గోవా వెళ్లాడు. అక్కడ ఆరు రోజులు ఉన్నాడు. అక్కడి నుంచి ఎండీఎంఏ డ్రగ్ కొనడానికి బెంగళూరు వెళ్లాడు. అక్కడికి హవీల డిలైట్‌ను పిలిపించుకున్నాడు. శ్రీవాత్సవ్ 21వ తేదీన గోవా నుంచి బెంగళూరుకు వెళ్లాడు. అదే సమయానికి హవీల అక్కడికి చేరుకుంది. ఇద్దరూ కలిసి బెంగళూరులో శ్రీవాత్సవ్ స్నేహితుడు ముత్యాల తరుణ్ రూమ్‌లో ఉన్నారు. శ్రీవాత్సవ్ తన స్నేహితుల ద్వారా మల్లెల మధుసూదన్‌రెడ్డి అలియాస్ మద్ది నుంచి రెండు గ్రాముల ఎండీఎంఏ డ్రగ్‌ను రూ.4,700కు కొన్నాడు. ఈ డబ్బును హవీల ఫోన్‌పే ద్వారా పంపింది. తర్వాత శ్రీవాత్సవ్ వాట్సాప్‌కు మద్ది డ్రాప్ పాయింట్ పంపాడు. అక్కడికి శ్రీవాత్సవ్, హవీల వెళ్లి ఎండీఎంఏను తీసుకుని తాగారు.

సింగసంద్రలో సిగరెట్ పెట్టె

శ్రీవాత్సవ్, హవీల బెంగళూరులో ఉండగా, వైజాగ్‌లో లోహిత్ యాదవ్ నుంచి ఫోన్ వచ్చింది. వచ్చేటప్పుడు 20 గ్రాముల ఎండీఎంఏ తీసుకురావాలని చెప్పాడు. తాను చెప్పినట్టు చేస్తే అందులో నుంచి రెండు గ్రాములు ఇస్తానని ఆఫర్ ఇచ్చాడు. లోహిత్ యాదవ్ వాట్సాప్ కాల్‌చేసి బెంగళూరులోని సింగసంద్ర మెట్రో రైల్వేస్టేషన్ వద్ద ఉన్న డ్రాప్‌పాయింట్ చిరునామా చెప్పాడు. దాని లొకేషన్‌ను శ్రీవాత్సవ్ వాట్సాప్‌కు పంపాడు. అక్కడ డ్రగ్స్ వ్యాపారులు ఎండీఎంఏను సిగరెట్ ప్యాకెట్లలో పెట్టి అక్కడ ఉంచారు. వాటిని తీసుకురావాలని లోహిత్ యాదవ్ చెప్పాడు. శ్రీవాత్సవ్, హవీల అక్కడికి వెళ్లి చూడగా 20 జిప్ కవర్ ప్యాకెట్‌ల్లో ఎండీఎంఏ ఉంది. అందులో ఒక ప్యాకెట్‌ను వారిద్దరూ తాగారు. 27వ తేదీన ఇద్దరూ కలిసి బెంగళూరు నుంచి వైజాగ్‌కు బస్ టికెట్లు బుక్ చేసుకున్నారు. డ్రగ్ ఉన్న 19 కవర్లలో తొమ్మిది ప్యాకెట్లను హవీలకు ఇచ్చాడు. మిగిలిన ప్యాకెట్లను శ్రీవాత్సవ్ తన వద్ద ఉంచుకున్నాడు. ఇద్దరూ కలిసి బెంగళూరు-విశాఖపట్నం బస్సు ఎక్కారు. ఈగల్ టీమ్‌కు వచ్చిన ముందస్తు సమాచారం మేరకు.. బస్సు విజయవాడలోని మహానాడు వద్దకు రాగానే ఆపి తనిఖీ చేయగా, వీరిద్దరూ పట్టుబడ్డారు. శ్రీవాత్సవ్‌తో ఎండీఎంఏ తెప్పిస్తున్న లోహిత్ యాదవ్‌ను మాచవరం పోలీసులు శనివారం అరెస్టు చేశారు. శుక్రవారం అతడి పుట్టినరోజు. ఆ సందర్భంగా నిర్వహించుకునే పార్టీ కోసమే ఈ డ్రగ్‌ను రప్పిస్తున్నట్టు తెలిసింది. పోలీసులకు దొరక్కపోయి ఉంటే ఈ డ్రగ్‌తో ఎంజాయ్ చేసేవారు. లోహిత్ యాదవ్‌ను శనివారం రాత్రి విజయవాడకు తీసుకొచ్చారు.

జ్వర జాగ్రత్త..!

(5వ పేజీ తరువాయి)

తీసుకోకపోవడంతో పరిస్థితి దారుణంగా ఉంది.

ఆసుపత్రులన్నీ కిటకిట

టైఫాయిడ్, విషజ్వరాలతో ఆసుపత్రులు కిటకిటలాడుతున్నాయి. ముఖ్యంగా చిన్నారులు ఎక్కువగా టైఫాయిడ్ బారినపడుతున్నారు. ప్లేట్‌లెట్స్ పడిపోతున్నాయని, డెంగీ పాజిటివ్ అని నిర్ధారణ కావడం లేదని వైద్యులు పేర్కొంటున్నారు. టైఫాయిడ్, జ్వరాలతో రోజుకు కనీసం 2 వేల మంది వస్తున్నారని వైద్యులు చెబుతున్నారు. ప్రభుత్వాసుపత్రితో పాటు ప్రైవేట్ ఆసుపత్రులు కిటకిటలాడుతున్నాయి. బెడ్‌లు దొరకని పరిస్థితి ఏర్పడుతోంది. ప్రతి ఇంట్లో కనీసం ఒకరైనా జ్వరంతో బాధపడుతున్నారు.

ఎమ్మెల్యే ఆదేశాలు బేఖాతరు

స్థానిక ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పలుమార్లు సమీక్షలు నిర్వహించి పట్టణంలో పారిశుధ్య నిర్వహణ మెరుగుపరచాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే ఆదేశాలను సైతం మున్సిపల్ అధికారులు పక్కన పెట్టేశారు. ప్రధాన రహదారుల వెంబడి డ్రెయిన్లలో సిల్ట్‌ను తొలగించారు. అంతర్గత డ్రెయినేజీలను శుభ్రపరచడం మరిచారు. ఒకటి రెండు రోజులు హడావిడి చేసి నిర్వహణను గాలికి వదిలేశారు. కనీసం చెత్త సేకరణకు అవసరమైన డబ్బాలు, పుష్‌కార్టులు కూడా లేవు. చెత్త సేకరణ వాహనాలు సరిపోవడం లేదు. పెరిగిన జనాభాకు సరిపడా పారిశుధ్య కార్మికులు కూడా లేకపోవడంతో నిర్వహణా లోపం స్పష్టంగా కనిపిస్తోంది.

పర్యాటకం ప్రైవేట్‌కు..

(5వ పేజీ తరువాయి)

కట్టబెట్టాలని నిర్ణయించింది. ప్రైవేటీకరణ విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. కొత్తగా ఏర్పాటుచేసే వాటిని పీపీపీ కింద చేపట్టాలని, నష్టాల్లో ఉన్న యూనిట్లను మాత్రమే అవకాశాన్ని బట్టి పీపీపీ వైపు తీసుకెళ్లాలన్నారు. మధ్యతరగతి వర్గాలకు భారంగా ఉండకూడదన్న ఉద్దేశంతో లాభాల్లో ఉన్న యూనిట్ల జోలికి వెళ్లొద్దని చెప్పారు. కానీ, పర్యాటక శాఖ సెక్రటరీ అజయ్‌జైన్ మాత్రం రిటైర్‌మెంట్ దగ్గరపడటంతో ఏపీటీడీసీ ఎండీ, చైర్మన్లు కాదంటున్నా వినకుండా ఏకపక్షంగా ప్రైవేటుకు కట్టబెట్టేందుకు ఆదేశించారు.

రూ.60 కోట్ల బకాయిల మాటేంటి..?

ప్రైవేటీకరణ పేరుతో గతంలో విచ్చలవిడిగా ఇచ్చిన లీజుల కారణంగా పర్యాటకాభివృద్ధి సంస్థకు ఇప్పటికీ రూ.60 కోట్ల బకాయిలు రావాల్సి ఉంది. ఏపీటీడీసీ అధికారులు ఇందులో ఒక్కపైసా కూడా రాబట్టలేకపోయారు. రాబోయే రోజుల్లో కూడా ఇదే పరిస్థితి తలెత్తితే పరిస్థితి ఏమిటన్న ప్రశ్న ఉత్పన్నమవుతోంది.

4 శాతం డబ్బు కడితే చాలట..!

ప్రైవేట్ సంస్థకు మంచి ప్రయోజనాలు కూడా కల్పిస్తున్నారు. ఏడాది లీజు మొత్తం రూ.4.50 కోట్లలో 4 శాతం డబ్బు కడితే చాలని బంపర్ ఆఫర్ ఇచ్చారు. మిగిలిన మొత్తాన్ని త్రైమాసిక విధానంలో కట్టుకునే అవకాశం కల్పించటం గమనార్హం. లీజు కాలాన్ని మాత్రం నిర్దేశించలేదు. 33 ఏళ్ల పాటు లీజుకు ఇవ్వాలన్న ఆలోచనలో ఉన్నా.. దానిని పేపర్‌లో ఎక్కడా పేర్కొనలేదు. వ్యతిరేకత వస్తుందేమోనన్న ఉద్దేశంతో ఆ పని చేయలేదని తెలుస్తోంది.



ఉపాధ్యాయులను సత్కరిస్తున్న ఆర్జేడీ నాగమణి

స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ అవార్డు గ్రహీతలకు సత్కారం

లబ్బీపేట, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల మానసిక, శారీరక ఎదుగుదలలో ఉపాధ్యాయుల కృషి కీలకమని రాష్ట్ర పాఠశాల విద్య ప్రాంతీయ సంచాలకురాలు (ఆర్జేడీ) జి.నాగమణి అన్నారు. ఎన్టీఆర్ జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో శనివారం స్కూల్ ఆఫ్ స్పోర్ట్స్ ఎక్సలెన్స్ అవార్డుల ప్రదానోత్సవం జరిగింది. జిల్లా విద్యాశాఖాదికారి యూవీ సుబ్బారావు మాట్లాడుతూ విద్యార్థులందరూ ఆటలాడేలా వ్యాయామ ఉపాధ్యాయులు చొరవ తీసుకోవాలన్నారు. రాష్ట్రంలోనే ప్రథమ స్థానం సాధించిన నున్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్ రవిప్రసాద్, వ్యాయమ ఉపాధ్యాయులు టి.శ్రీలత, టి.విజయవర్మను, ఇతర ఉపాధ్యాయులను సత్కరించారు.

వేరుశెనగ విత్తనాలను వేరు చేశారు..!

(5వ పేజీ తరువాయి)

కాకుండా తరలించేశారు.

రైతులతో సంతకాలు తీసుకుంటూ..

మచిలీపట్నం మండలంలోని సముద్ర తీరం వెంబడి ఉన్న గ్రామాల్లోని ఇసుక భూముల్లో ఖరీఫ్‌లో కూడా వేరుశెనగ సాగు చేపడతారు. ఈ నేపథ్యంలోనే ఎన్ఎంఈవో పథకం ద్వారా వశిష్ట రకం వేరుశెనగ విత్తనాలను ఉచితంగా అందజేశారు. వాస్తవంగా వేరుశెనగ పంటను సాగుచేసే రైతులకు రైతుసేవా కేంద్రాల ద్వారా ఈ విత్తనాలను అందజేయాలి. అయితే, ఒకరిద్దరు ద్వితీయశ్రేణి నాయకులు ఇదే అదనుగా తీసుకుని విత్తనాల పంపిణీలో జోక్యం చేసుకుని తమకు అనుకూలమైన వారి పేర్లను ముందస్తుగానే జాబితాల్లో చేర్చారు. గోపువానిపాలెం, కరగ్రహారం, తాళ్లపాలెం, పల్లెపాలెం, మంగినపూడి, తపసిపూడి, గోకవరం తదితర గ్రామాలకు చెందిన రైతులు వేరుశెనగ పంటను సాగు చేస్తున్నట్లుగా జాబితాల్లో చూపారు. తమకు అనుకూలమైన వారి పేర్లను జాబితాల్లో చేర్చి వారికి విత్తనాలు ఉచితంగా ఇచ్చినట్టుగా చూపేందుకు రైతులతో సంతకాలు కూడా తీసుకున్నారు. అరెకరం భూమి ఉన్న రైతుకు 60 కిలోలు, 10 ఎకరాలు సాగుచేస్తున్న రైతుకు కూడా 60 కిలోల చొప్పున మాత్రమే వేరుశెనగ విత్తనాలు ఇస్తామని చెప్పి, తమ చిత్తానుసారంగా జాబితాలు తయారు చేయించారు. ఈ జాబితాల ప్రకారం పలు గ్రామాల్లో వేరుశెనగ పంటను సాగుచేయని రైతులకు విత్తనాలు ఇచ్చినట్టుగా చూపారు. వీరికి విత్తనాలు ఎలా ఇచ్చారనే అంశంపై మిగతా రైతులు ఆరా తీశారు. గ్రామాల్లో తమకు అనుకూలమైన పదిమందిలోపు రైతులకు వేరుశెనగ విత్తనాలు ఇచ్చి, మిగిలిన వాటిని దారి మళ్లించారనే విషయం బయటకు వచ్చింది. రైతులు విత్తనాల కోసం రైతుసేవా కేంద్రాలకు వెళ్లగా, పంపిణీ పూర్తయిందని, జాబితాల్లో మీపేర్లు లేవని చెప్పడం గమనార్హం

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	118, 126, 137
చికెన్ విత్ స్కిన్	224
చికెన్ స్కిన్‌లెస్	234



నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 560

వేగంగా రోడ్డు విస్తరణ పనులు



కానూరు, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : కానూరు సనత్‌నగర్ యూసీ సెంటర్ నుంచి తులసీనగర్ మూడవ రోడ్డు వరకు రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్నాయి. 40 అడుగుల వెడల్పు ఉన్న ఈరోడ్డును 80 అడుగులకు విస్తరించేందుకు జరుగుతున్న విస్తరణ పనులను శనివారం తాడిగడప మున్సిపల్ కమిషనర్ షేక్ నజీర్ పరిశీలించారు. ఈ రోడ్డు విస్తరణలో సొంత స్థలం పోగొట్టుకునే వారికి బాండ్‌లు అందజేస్తామని కమిషనర్ పేర్కొన్నారు. సీఆర్‌డీఏ నిధులతో ఈరోడ్డు విస్తరణ పనులు జరుగుతున్నాయని చెప్పారు. రోజు రోజుకూ పెరుగుతున్న ట్రాఫిక్ దృష్ట్యా ఈరోడ్డు విస్తరణ అనివార్యం అయిందన్నారు.

సూపర్ సిక్స్‌లో మహిళలకే ప్రాధాన్యం

- స్త్రీశక్తి సూపర్ హిట్ మహాసభలో ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల, ఎమ్మెల్యే బోడె ప్రసాద్
- ఉచిత బస్సులో మరిన్ని వెసులుబాట్లు
- వేలాది మంది మహిళలతో కిక్కిరిసిన సభా ప్రాంగణం



సభలో మాట్లాడుతున్న ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ, వేదికపై ఎమ్మెల్యే బోడె ప్రసాద్, హేమచౌదరి, సుచిత్ర

పెనమలూరు, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : సూపర్ సిక్స్ పథకాల్లో రాష్ట్రంలో మహిళలకే అధిక ప్రాధాన్యత లభిస్తోందని ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ, ఎమ్మెల్యే బోడె ప్రసాద్ పేర్కొన్నారు. శనివారం పోరంకిలోని పద్మావతి కళ్యాణ వేదిక ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన స్త్రీ శక్తి సూపర్ హిట్ మహాసభకు వారు హాజరై వేలాది మహిళలనుద్దేశించి మాట్లాడారు. ఉచిత బస్సు పథకాన్ని 15లక్షల మంది మహిళలు వినియోగించుకుంటారని ప్రభుత్వం అంచనా వేస్తే.. 20 లక్షల మంది మహిళలు వినియోగించుకొంటున్నారని పేర్కొన్నారు. కేవలం రెండు వారాల్లో రూ. 90కోట్లు ఉచిత బస్సు ప్రయాణంపై ప్రభుత్వం ఖర్చు పెట్టిందని, ఉద్యోగం, చదువు, ఉపాధికి వెళ్లే మహిళలకు ఇది ఉపయోగకరంగా ఉంటుందని, ఈపథకాన్ని ఉపయోగించుకొని మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతారన్న ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్రం మొత్తం మీద 10800 బస్సులు రోడ్లపై తిరుగుతుంటే అందులో 2500 బస్సులు ఉచిత బస్సు ప్రయాణానికి వినియోగిస్తున్నట్లు తెలిపారు. మరో 1350 బస్సులను కొనుగోలు చేస్తున్నామని, సిబ్బందిని మరింత పెంచి ఏసీ బస్సుల్లో సైతం మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పించి మరిన్ని వెసులుబాట్లు ఇచ్చే ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు. చేసింది చెప్పుకోవడం, చేయాల్సింది ఒప్పుకోవడంలో తాము ముందుంటామని తెలిపారు. సూపర్ సిక్స్ పథకాల్లో దాదాపు 90శాతం నెరవేర్చామని తెలిపారు. రాష్ట్రాన్ని అభివృద్ధి చేసుకుంటూ మరో పక్క వినూత్న సంక్షేమ పథకాలతో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌లు ముందుకు తీసుకెళుతున్నారని పేర్కొన్నారు. రాష్ట్ర మహిళలు ముఖ్యమంత్రికి, ఉపముఖ్యమంత్రికి అండగా ఉండి దీవెనలు అందజేయాలని పిలుపునిచ్చారు. టీడీపీ తాడిగడప మునిసిపాలిటీ అధ్యక్షుడు అనుమోలు ప్రభాకరరావు, రాష్ట్ర తెలుగుమహిళ అధికార ప్రతినిధి యార్లగడ్డ సుచిత్రలు మాట్లాడుతూ, రాష్ట్ర మహిళలకు ప్రభుత్వం కల్పిస్తున్న అనేక సంక్షేమ పథకాలతో జీవితంలో అన్ని విధాలుగా అభివృద్ధి చెంది తమ కాళ్లమీద తాము నిలబడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బోడె హేమ చౌదరి, తలసిల స్వర్ణలత, మేడసాని రత్నకుమారి, నెరుసు రాజ్యలక్ష్మి, ఎం కళ్యాణి, మారుపూడి ధనకోటేశ్వరరావు, కోయ ఆనంద్‌ప్రసాద్, కుర్రా నరేంద్ర, కొండా ప్రవీణ్, శొంఠి శివరాంప్రసాద్, సంగెపు రంగారావు, యేకుల విజయేంద్ర, దోనేపూడి రవికిరణ్, తుమ్మల రాంకుమార్, పులి కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికట్టాలి

గన్నవరం న్యాయాధికారి ఎం.గాయత్రి




న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న న్యాయాధికారి గాయత్రి

గన్నవరం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : బాల్య వివాహాలను అంగీకరించకూడదని గన్నవరం న్యాయాధికారి ఎం.గాయత్రి బాలబాలికలకు సూచించారు. మండలంలోని గొల్లనపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్లో శనివారం న్యాయ విజ్ఞాన సదస్సు జరిగింది. దీనికి హెచ్ఎం కొల్లి సత్య జగదీశ్వరరావు అధ్యక్షత వహించారు. న్యాయాధికారి గాయత్రి మాట్లాడుతూ, ఈ వయసు విద్యార్థుల ఆలోచనలు ఎంత మంచిగా ఉంటే భవిష్యత్తు అంత ఉన్నతంగా తీర్చిదిద్దుకోవచ్చన్నారు. చదువుకునే వయసులోనే పెళ్లిళ్లు చేయడం అవాంఛనీయమని, ఆరోగ్యరీత్యా, మానసిక వికాస లేమి దృష్ట్యా, చదువు పురోగతి రీత్యా తీవ్ర ఆటంకం కలిగిస్తాయని హెచ్చరించారు. పురుషుల గుడ్, బ్యాడ్ టచ్‌ల తీరు ప్రతి బాలికా గమనించి తద నుగుణంగా రక్షణ చర్యలు, తల్లిదండ్రుల సహాయం తీసుకోవా లన్నారు. చదువు విజ్ఞానాన్ని, ఉన్నత వ్యక్తిత్వాన్ని, ప్రాపంచిక దృష్టిని అలవరుస్తుందని, జీవితాన్ని కూడా తీర్చి దిద్దుతుందని చెప్పారు. అమ్మపేరిట ఒక మొక్కను నాటి పర్యావరణహితమైన మొక్కలను ప్రతి ఒక్కరూ నాటాలని సూచించారు. ఎస్ఐ కిషోర్, ఉపసర్పంచ్ యనమదల సుబ్బారావు పూర్వ విద్యార్థులు ఉడుతా రామకృష్ణ, యనమదల సతీష్, గణపవరపు వెంకయ్య, న్యాయవాది పలగాని వేణు, పలగాని నాగేశ్వరరావు, దాసరి విజయరావు తదితరులు పాల్గొన్నారు.

అన్విత.. అనితర సాధ్యురాలు

- తొలి ప్రయత్నంలోనే నీట్ పీజీలో 202 ర్యాంకు
- ఎంబీబీఎస్‌లోనూ బెస్ట్ ఔట్ గోయింగ్ స్టూడెంట్



తండ్రి సతీష్‌తో పుట్టగుంట అన్విత

విజయవాడ సిటీ , ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): నీట్ పీజీ పరీక్షలో తొలి ప్రయత్నంలోనే సీటు సంపాదించడం అంటే ఆషామాషీ కాదు. సుమారు రెండున్నర లక్షల మంది పోటీపడే ఈ పరీక్షల్లో అధికశాతం రెండో ప్రయత్నంలోనో.. మూడో ప్రయత్నంలోనో సీటు సాధించిన వారే ఉంటారు. అలాంటిది విజయవాడకు చెందిన పుట్టగుంట అన్విత తొలి ప్రయత్నంలోనే 202 ర్యాంకు సాధించారు. అన్విత తొలి నుంచీ చదువులో మొదటి ర్యాంకరే. సిద్ధార్థ ప్రభుత్వ వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ పూర్తి చేసిన అన్విత 2019-24 ఎంబీబీఎస్ బ్యాచ్‌లో అత్యుత్తమ ప్రతిభావంతురాలైన మెడికోగా పేరుపొందారు. ఓవరాల్ బెస్ట్ స్టూడెంట్‌గా గుర్తించి అన్వితకు బెస్ట్ ఔట్ గోయింగ్ వైద్యవిద్యార్థినిగా కళాశాల యాజమాన్యం పురస్కారాన్ని అందించింది. పీజీలో జనరల్ మెడిసిన్ చేసిన తర్వాత న్యూరాలజీ చేయాలని అనుకుం టున్నట్లు అన్విత తెలిపారు. మొదటి ప్రయత్నంలోనే నీట్‌లో ర్యాంకు సాధించడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఎంబీబీఎస్ నాలుగో సంవత్సరం నుంచే పీజీ ఎంట్రన్స్‌పై దృష్టి సారిస్తూ చదివానని, ఆన్‌లైన్ యాప్‌ల్లో ఎగ్జామ్స్ రాయడంతో పాటు, కోర్సులు వింటూ ఉండేదానన్ని అన్విత చెప్పారు. తాను చదువులో రాణించేందుకు ప్రధాన కారణం కళాశాల గురువులతోపాటు తల్లిదండ్రులు పుట్టగుంట సతీశ్, రోజా అని తెలిపారు. వారి ప్రోత్సాహం వల్లే మొదటి ప్రయత్నంలోనే ర్యాంకు సాధించగలిగానని తెలిపారు. కష్టపడితే సాధించలేని ఏదీ లేదని నమ్ముతానన్నారు.

లక్ష్య సాధనకు నిర్విరామ కృషి అవసరం



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ముళ్లపూడి కృష్ణమోహన్

ఉయ్యూరు, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థి దశలో లక్ష్యాన్ని నిర్దేశించుకుని సాధనకు కృషి చేయాలని రిటైర్డ్ సివిల్ ఇంజనీర్ ముళ్లపూడి కృష్ణమోహన్ అన్నారు. ఏజీ అండ్ ఎస్‌జీఎస్ కళాశాల కెరీర్ గైడెన్స్ అండ్ ప్లేస్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో శనివారం విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. లక్ష్యసాధనకు పలు సూచనలిచ్చి విద్యార్థుల సందేహాలు నివృత్తి చేశారు. లక్ష్య సాధనలో మొదటి ప్రయత్నంలో విఫలమైన నిరాశ చెందకుండా మరింత పట్టుదలతో సాధించాలన్నారు. ప్రిన్సిపాల్ ఎం.శివనాథ్, ప్రత్యేక అధికారి కె.సత్యనారాయణ, వాణిజ్యశాస్త్ర విభాగ అధిపతి ఎస్.వసంతరావు, ఉపాధి శిక్షణ అధికారి సీహెచ్ అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

రైలుకింద పడి యువకుడు బలవన్మరణం

గన్నవరం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : సరైన ఉద్యోగం లేదని నిరాశ చెందిన ఓ యువకుడు రైలుకింద పడి బలవన్మరణం చెందాడు. ఈ ఘటన మండలంలోని పురుషోత్తపట్నం రైల్వే గేట్ సమీపంలో శుక్రవారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇచ్ఛాపురానికి చెందిన గుజ్జు బాలాజీ రెడ్డి (24) తల్లితో కలిసి విజయవాడ వచ్చి రామలింగేశ్వరనగర్‌లో ఉంటున్నారు. బాలాజీరెడ్డి బెంజ్ సర్కిల్ సమీపంలో ఉద్యోగం చేస్తున్నాడు. ఈ ఉద్యోగంలో సంతృప్తి లేకపోవడంతో శుక్రవారం మధ్యాహ్నం సమయంలో రైల్వే గేట్ దగ్గరకొచ్చి ఆత్మహత్యకు ప్రయత్నించగా రైల్వే సిబ్బంది గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు అదుపులోకి తీసుకొనగా అప్పటికే ఫుల్లుగా మద్యం సేవించి ఉన్నాడు. అతనిని పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చే ప్రయత్నం చేయగా పారి పోయాడు. ఆ తర్వాత రాత్రి 11 గంటల సమయంలో రైలుకింద పడి బలవన్మరణం చెందాడు. పలక్ నామ సూపర్ ఫాస్ట్ రైలు డ్రైవర్ మృతదేహాన్ని చూసి స్టేషన్ మాస్టర్‌కు సమాచారం ఇచ్చాడు. రైల్వే పోలీసులు వచ్చి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తీసుకువెళ్లారు.

లయన్స్ సేవలు అభినందనీయం



మెగా కంటి, దంత వైద్య పరీక్షలను పరిశీలిస్తున్న మాజీ ఎంపీపీ దేవినేని రాజా, లయన్ రావి సురేష్ బాబు

కంకిపాడు, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : లయన్స్ క్లబ్ చేస్తున్న సేవలు అభినం దనీయమని కంకిపాడు మాజీ ఎంపీపీ దేవినేని రాజా అన్నారు. ఈడుపుగల్లులో ని శ్రీవిద్యాలయంలో లయన్ రావి సురేష్‌బాబు ఆధ్వర్యంలో లయన్స్ క్లబ్ సహకారంతో ఏర్పాటు చేసిన ఉచిత కంటి, దంత వైద్య పరీక్షలను ఆయన ప్రారంభించారు. వైద్యులు చిగురుపాటి హాసిత, దావులూరు దినేష్, సాయి హర్షిత వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పందిపాటి ఇందిర, డిస్ట్రిక్ట్ విజన్ కేర్ ఛైర్మన్ యర్రంశెట్టి శ్రీనివాసరావు, యార్లగడ్డ విజయ్‌కుమార్, శిరీష్, గ్రామ పెద్దలు పర్వతనేని తిలక్, నందమూరి మాధవ, సుధాకర్, సలీం తదితరులు పాల్గొన్నారు.

365వ వారం అన్నదానం



అన్నదానం నిర్వహిస్తున్న ట్రస్ట్ చైర్మన్ అవిర్నేని రాధాకృష్ణను అభినందిస్తున్న ఈవో శ్రీనివాస్

హనుమాన్‌జంక్షన్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక నూజివీడు రోడ్డులోని శ్రీలక్ష్మీవెంకటేశ్వరస్వామి దేవస్థానంలో వేలేరు వెంకటేశ్వర అవిర్నేని తారకబ్రహ్మం, దోణ వల్లి పుష్పావతి చారిటబుల్ ట్రస్ట్ ప్రతి శనివారం నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమం 365వ వారానికి చేరింది. శనివారంతో అన్నదానం కార్యక్రమం చేపట్టి ఏడేళ్లు పూర్తి చేసుకొని 8వ సంవత్సరంలోకి అడుగు పెట్టింది. ట్రస్ట్ చైర్మన్ అవిర్నేని రాధాకృష్ణను దేవస్థానం ఈవో వై. శ్రీనివాస్ స్వామి వారి శేషవస్త్రంతో సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో వేగుంట రాము, గుమ్మడి శేషగిరి, విశ్రాంత అధ్యాపకులు బుచ్చిబాబు పాల్గొన్నారు.

పెదపులిపాకలో ప్రభుత్వ పథకాల పరిశీలన



గ్రామంలో జరుగుతున్న పథకాలను అధికారులకు వివరిస్తున్న సర్పంచి శ్రీనివాసచౌదరి

పెనమలూరు, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : మూడు రోజుల నీటి సంరక్షణ ప్రణాళిక శిక్షణా కార్యక్రమంలో భాగంగా జిల్లా స్థాయి ఉన్నతాధికారుల బృందం మండలంలోని పెదపులిపాకలో శనివారం పర్యటించింది. వివిధ జిల్లాల నుంచి వచ్చిన ఆర్‌డబ్ల్యుఎస్ శాఖ ఎస్ఈ, డీఈ స్థాయి అధికారులు గ్రామపంచాయతీలోని ఓహెచ్ఎస్ఆర్‌ల నిర్వహణ, వాటి పనితీరు, నీటివనరుల లభ్యత, నీటి పంపిణీ నిర్వహణ, పారిశుధ్య నిర్వహణ, చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం పనితీరును పరిశీలించారు. అధికారులకు గ్రామ సర్పంచి గుంటూరు శ్రీనివాసచౌదరి గ్రామంలోని అన్ని అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి తిరుమల వెంకటరత్నం పాల్గొన్నారు.



రంగన్నగూడెంలో పూజలు నిర్వహిస్తున్న ఆళ్ల గోపాలకృష్ణ దంపతులు

వైభవంగా గణనాథుడికి పూజలు

గన్నవరం ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలో గణేష్ నవరాత్రి మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. కేసరపల్లి శ్రీ హేమదుర్గ జ్యువెల్ కౌంటి విజయలక్ష్మి ఎస్టేట్‌లో ఏర్పాటు చేసిన గణేశుని విగ్రహానికి శనివారం ప్రత్యేక పూజలు చేశారు. ప్రముఖ న్యాయవాది కె.వి.రమణ, ఏఎంసీ మాజీ చైర్మన్ పొట్లూరి బసవరావు, గణేష్ ఉత్సవ సమితి కమిటీ అధ్యక్షుడు కేహెచ్ కోటేశ్వరరావు, టీడీపీ సీనియర్ నాయకులు జాస్తి వెంకటేశ్వరరావు, కెల్లా రాంప్రసాద్, బయ్యారెడ్డి రవీంద్రారెడ్డి, రాజులపాటి శ్రీనివాసరావు, యలమంచిలి సుబ్రహ్మణ్యేశ్వరరావు, గొల్లపూడి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పెనమలూరు : యనమలకుదురు శివపార్వతీనగర్ వద్ద వీరంకి నంది ఫ్రెండ్స్ సర్కిల్ ఏర్పాటు చేసిన వినాయకుని విగ్రహం వద్ద రాష్ట్ర గౌడ వెల్ఫేర్, డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ శొంఠి శివరాం సుశీల దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వీరంకి కుటుంబరావు, జన్ను నాగరాజు, వీరంకి నంది, ఆరేపల్లి దుర్గేష్, నార్గం రాము, తాడిశెట్టి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్‌జంక్షన్‌రూరల్ : రంగన్నగూడెంలో యువ గణేష్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకచవితి వేడుకల్లో శనివారం ఆళ్ల గోపాలకృష్ణ దంపతులు ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పుసులూరి వెంకటకృష్ణప్రసాద్, కసుకుర్తి వేణుబాబు, ఆలపాటి రాంబాబు తదితరులు పాల్గొన్నారు. కమిటీ సభ్యులు తుమ్మల విజయ్, వెనిగళ్ల జ్ఞానశేఖర్, నెరుసు వెంకటేశ్వరరావు, తరుణ్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

కంకిపాడు : ఘననాధుడి చవితి పందిళ్లను తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు తుమ్మలపల్లి హరికృష్ణ సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కంకిపాడులోని విష్ణాలయం వద్ద ఏర్పాటు చేసిన అన్నదానాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం విజయలక్ష్మీ థియేటర్ ఎదుట ఏర్పాటు చేసిన వినాయకుడి పందిరిని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ కో కన్వీనర్ పులి శ్రీనివాసరావు, టీడీపీ నాయకులు కొండా నాగేశ్వరరావు, చిట్టూరి నాగేశ్వరరావు, గోగినేని వెంకటరమణ, ఏనుగ జయప్రకాష్, వీరంకి శ్యామ్, బాజి, మేడండ్రావు రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్‌జంక్షన్ : స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద మాజీ ఎంపీటీసీ సభ్యులు బొకినాల సాంబశివరావు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వినాయక ఉత్సవ పందిరిలో ఏర్పాటు చేసిన నాలుగు చేతులతో (చతుర్భుజ)కూడిన గణనాయకుడి విగ్రహం ఆకర్షణీయంగా నిలిచింది. రామ మందిరంలో ఆసీనులైన తన నాలుగు చేతుల్లో శంఖం, చక్రం, అభయ హస్తం, లడ్డూ ప్రసాదాలను వినాయకుడు చేబూనినట్లు కనిపిస్తాడు.




యనమలకుదురులో.. కంకిపాడులో..

గివింగ్ బ్యాక్ టూ సొసైటీ సహకారంతో
సిమెంటు బల్లల ఏర్పాటు



పెనమలూరు, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : వణుకూరు జగనన్న కాలనీలో గివింగ్ బ్యాక్ టూ సొసైటీ సహకారంతో ప్రజలు కూర్చునేందుకు శుక్రవారం ఐదు సిమెంటు బల్లలు ఏర్పాటు చేశారు. బల్లలకు రంగులు వేయించి తీర్చిదిద్దారు. ఈ సందర్భంగా స్థానికులు మాట్లాడుతూ, ఏ సౌకర్యాలు లేని తమ కాలనీలో సిమెంటు బల్లలు ఏర్పాటు చేయడం ఆనందదాయకమన్నారు. గివింగ్ బ్యాక్ టూ సొసైటీ ప్రతినిధులను అభినందించారు.

ఆటపాటలతో పాటు చదువుల్లోనూ రాణించాలి

టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చిరుమామిళ్ల సూర్యం

హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : ఆటపాటలతో పాటు చదువుల్లో రాణించాలని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చిరుమామిళ్ల సూర్యం విద్యార్థులకు సూచించారు. వేలేరులోని నేతాజీ సుభాస్‌చంద్రబోస్ ఆవాసీయ విద్యాలయ విద్యార్థులతో కలిసి శనివారం తన పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. రైతు సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి వేములపల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో టీడీపీ నాయకుడు యార్లగడ్డ సతీష్‌తో కలిసి సూర్యం దంపతులు కేక్‌ను కట్‌చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సుంకర బోస్, టీడీపీ నాయకులు కోనేరు నాగేంద్రకుమార్, దొంతు చిన్నా, గుండపనేని ఉమావర ప్రసాద్, మూల్పూరి సాయికళ్యాణి, ఎస్ఎస్ఎల్పీ ప్రాజెక్ట్ కమిటీ వైస్ చైర్మన్ ఆళ్ల గోపాలకృష్ణ, డీసీ చైర్మన్ కొమ్మారెడ్డి రాజేష్, చిన్నాల చిన్నా, మేడేపల్లి రమ, వేగిరెడ్డి పాపారావు, చైతన్య, మొవ్వా వేణుగోపాల్, కర్రా ప్రసాద్‌పాల్, తదితరులు పాల్గొన్నారు.

అభయాంజనేయస్వామిని దర్శించుకున్న టీడీపీ నేత సూర్యం

హనుమాన్‌జంక్షన్: టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చిరుమామిళ్ల సూర్యనారాయణప్రసాద్ తన జన్మదిన వేడుకను శనివారం జంక్షన్‌లో టీడీపీ నాయకులు, అభిమానుల మధ్య ఘనంగా జరుపుకున్నారు. జన్మదినం, వివాహ వార్షికోత్సవం ఒకేరోజు కావడంతో సూర్యం, లక్ష్మి దంపతులు స్థానిక అభయాంజనేయ స్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దేవస్థానం ఎదుట టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు మధ్య సూర్యం కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో నాగార్జున సాగర్ ఎడమ కాలువ పీసీ వైస్ ఛైర్మన్ ఆళ్ల గోపాలకృష్ణ, దెందులూరు ఏఎంసీ ఛైర్‌పర్సన్ గారపాటి రామసీత, గన్నవరం ఏఎంసీ డైరక్టర్ గార్లపాటి రాజేశ్వరరావు, కూటమి నాయకులు వేమూరి శ్రీనివాసరావు, అట్లూరి శ్రీనివాసరావు, మొవ్వా వేణు, పొట్లూరి ఫణి, తదితరులు పాల్గొని శుభాకాంక్షలు తెలియజేశారు.



జంక్షన్ అభయాంజనేయస్వామి ఆలయం వద్ద కేకు కట్ చేస్తున్న సూర్యం

నైపుణ్యంతో ఐటీ కొలువులు

ఎన్టీఆర్ వికాసతో నిరుద్యోగులకు చేయూత

● 8 నెలల్లో 1500 మందికి ఉపాధి ● ప్రతి వారం ఇంటర్వ్యూలు, ఉద్యోగాలు
● అందరూ వికాసను వినియోగించుకోండి: వికాస ప్రాజెక్ట్ డైరెక్టర్ లచ్చారావు



ఇంటర్వ్యూలను పరిశీలిస్తున్న ఎన్టీఆర్ వికాస పీడీ లచ్చారావు

ఆంధ్రజ్యోతి, కలెక్టరేట్: కాస్త నైపుణ్యం ఉంటే చాలు! ఐటీ కొలువులు ఇట్టే ఒడిసిపట్టుకుంటున్నారు. ఎన్టీఆర్ జిల్లాలో ఇంజనీరింగ్ చేసిన నిరుద్యోగ యువతకు ఎన్టీఆర్ వికాస పథకం అందివచ్చిన అవకాశంగా మారింది. 2014లో చంద్రబాబు ప్రభుత్వ హయాంలో నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించే ఉద్దేశంతో ఏర్పాటైన 'ఎన్టీఆర్ వికాస' ద్వారా నిరుద్యోగులు ఐటీ కొలువులు సాధిస్తున్నారు. 2024 డిసెంబరు 28 నుంచి ఎన్టీఆర్ కలెక్టరేట్‌లో ప్రారంభమైన ఎన్టీఆర్ వికాస ద్వారా ఇప్పటి వరకు దాదాపుగా 1500 మంది నిరుద్యోగ యువత ఉద్యోగాలు సాధించారంటే అతిశయోక్తి కాదు. కలెక్టరేట్‌లో ప్రతి శనివారం వివిధ సాఫ్ట్‌వేర్, ప్రైవేటు కంపెనీల ప్రతినిధులు వచ్చి అభ్యర్థులను ఇంటర్వ్యూలు చేసి ఉద్యోగులు ఇస్తున్నారు. రెండో శనివారమైతే ముందురోజునే ఇంటర్వ్యూలు జరుగుతుంటాయి. 2014లో తొలిసారిగా కాకినాడ నుంచి ప్రారంభమైన ఎన్టీఆర్ వికాస అంచెలంచెలుగా రాష్ట్రంలోని ప్రధాన నగరాలకు వ్యాప్తిచెంది నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పించడంలో ముందుంటోంది. వారం వారం ఇంటర్వ్యూలు ఉండటంతో ఒకరోజు సెలక్ట్ కాని వారు మరో వారం వస్తుందిలే అనే ధీమాతో ఉంటున్నారు. శనివారం కలెక్టరేట్‌లో జరిగిన సాఫ్ట్‌వేర్ కంపెనీ ఉద్యోగాలకు దాదాపు 150 మంది యువత వివిధ జిల్లాల నుంచి హాజరయ్యారు. పదేళ్లల్లో రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 2 లక్షల మంది అభ్యర్థులు ఇంటర్వ్యూల్లో ఉత్తీర్ణులై ఉద్యోగాలను సాధించకున్నారు.


ఇంటర్వ్యూ కోసం నిరీక్షిస్తున్న నిరుద్యోగులు

నిరుద్యోగాన్ని పారదోలండి

వికాస ప్రాజెక్ట్ డైరెక్టర్ లచ్చారావు

ఎన్టీఆర్ వికాస ద్వారా నిరుద్యోగులు తమ అదృష్టాన్ని పరీక్షించుకొని నిరుద్యోగాన్ని పారద్రోలాలని ఎన్టీఆర్ వికాస ప్రాజెక్ట్ డైరెక్టర్ కే లచ్చారావు తెలిపారు. ఎన్టీఆర్ కలెక్టరేట్‌లోని వికాస ద్వారా 8 నెలల్లో ఇప్పటివరకు దాదాపు 1500 మంది నిరుద్యోగులు ఉద్యోగాలు సాధించారన్నారు. ప్రతి శనివారం జరిగే ఈ ఇంటర్వ్యూల్లో నిరుద్యోగ అభ్యర్థులు పాల్గొని తమ నైపుణ్యాన్ని ప్రదర్శించి ఉద్యోగాలు సాధించాలని కోరారు.

56 మందికి ఉద్యోగావకాశాలు

కలెక్టరేట్‌లో శనివారం నిర్వహించిన జాబ్‌మేళాలో 56 మంది ఉద్యోగార్హత సాధించారు. ఆన్‌లైన్‌లో 313 మంది రిజిస్టర్ కాగా 178 మంది ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. ఫ్లిప్‌కార్ట్ కంపెనీ ఇంటర్వ్యూకు 45 మంది హాజరుకాగా 24 మంది ఉద్యోగార్హత సాధించారు. సాఫ్ట్‌వేర్ కంపెనీ ఆఫ్ కెట్ ఐటీ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఇంటర్వ్యూలకు 133 మంది హాజరుకాగా 32 మంది సెలక్ట్ అయ్యారు. సెలక్ట్ అయిన అభ్యర్థులకు సోమ, మంగళవారాల్లో ఆఫర్ లెటర్ ఇస్తారని ఎన్టీఆర్ వికాస పీడీ కే లచ్చారావు తెలిపారు.

కంపెనీల చుట్టూ తిరిగే పని ఉండదు

పడిది గణేష్ కుమార్



డిగ్రీ సర్టిఫికెట్లు చేతపట్టుకొని ఉద్యోగాల కోసం సాఫ్ట్‌వేర్ కంపెనీల చుట్టూ తిరిగే పనిలేకుండా చంద్రబాబు ప్రభుత్వం ఎన్టీఆర్ వికాస ద్వారా నిరుద్యోగ అభ్యర్థులను ఆదుకోవడం మంచి పరిణామం. ఎన్టీఆర్ కలెక్టరేట్‌లోని వికాసకు రావడం ఇదే తొలిసారి అయినా ఉద్యోగం వస్తుందనే నమ్మకంతో ఉన్నా. ఇవాళ రాకపోయినా రానున్న రోజుల్లో ఉద్యోగం సాధించి తీరతాను.

నిరుద్యోగులకు వరం ఎన్టీఆర్ వికాస: వీ గాయత్రీ లీల



డిగ్రీ సాధించిన తర్వాత ఎన్టీఆర్ వికాసకు వచ్చే పలు సాఫ్ట్‌వేర్ కంపెనీల ద్వారా ఉద్యోగం వస్తుందనే నమ్మకాన్ని ప్రభుత్వం కలిగిస్తోంది. ఇలాంటి జాబ్‌మేళాల ద్వారా నిరుద్యోగులకు ఉద్యోగం వస్తుందనే భరోసా ఇచ్చినట్లవుతుంది.

ఎన్టీఆర్ వికాసకు రావడం ఇదే తొలిసారి: కే ధనేశ్వర్



ఎన్టీఆర్ వికాసకు రావడం ఇదే తొలిసారి. పత్రికల్లో ప్రకటన చూసి అదృష్టాన్ని పరీక్షించుకొందామని నేను, నా స్నేహితుడు వచ్చాం. వారం వారం జాబ్‌మేళా ఉంటుంది. ఇవాళ కాకపోతే రేపైనా ఉద్యోగం వస్తుంది.

గత ప్రభుత్వం పట్టించుకోలేదు: ఆర్ మురళీకృష్ణ



కూటమి ప్రభుత్వం వచ్చిన మెగా డీఎస్సీని ప్రకటించడం, ఎన్టీఆర్ వికాసతో వేలాది మందికి ఉద్యోగాలు వచ్చేలా చేయడం చంద్రబాబు తీసుకొన్న మంచినిర్ణయం. గత ప్రభుత్వంలో ఉద్యోగులను పట్టించుకోలేదు. వారం వారం ఇలాగే జాబ్‌మేళాలో నిరుద్యోగులకు ఇంటర్వ్యూలు కొనసాగితే కొన్నాళ్లకు నిరుద్యోగాన్ని రూపుమాపవచ్చు.

జాబ్‌మేళాలో 89 మందికి ఉద్యోగాలు


ఇంటర్వ్యూ నిర్వహిస్తున్న కంపెనీ హెచ్‌ఆర్

గుడివాడ, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక అక్కినేని నాగేశ్వరరావు కళాశాలలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్‌మేళాలో 89 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి డాక్టర్ పీ నరేష్‌కుమార్ తెలిపారు. శనివారం నిర్వహించిన జాబ్‌మేళాకు 248 మంది హాజరయ్యారన్నారు. ఎప్తానిక్స్ సిస్టమ్స్, హెటిరో ల్యాబ్స్, జోయాలుక్కాస్ జ్యువెలరీ, మేకనార్ ఫార్మా, బిగ్-సి, జేసీ గ్రాఫిక్స్, మెడ్‌ప్లస్, కురాకు ఫైనాన్షియల్ సర్వీస్, క్యూస్ కార్పొరేషన్, రాపిడో వంటి 10 ప్రముఖ కంపెనీల హెచ్‌ఆర్‌లు పాల్గొన్నారన్నారు. 89 మంది ఉద్యోగాలకు ఎంపికవ్వగా, 64 మంది పైస్థాయి ఇంటర్వ్యూలకు ఎంపికయ్యారన్నారు. జిల్లా ఉపాధి అధికారి డీ విక్టర్‌బాబు, కళాశాల పాలకవర్గ అధ్యక్షకార్యదర్శులు ఎల్‌ఆర్‌కే ప్రసాద్, కేఎస్ అప్పారావు, ప్రిన్సిపాల్ డాక్టర్ పీజీఎస్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ బీఎస్ఎస్ పద్మజ, విద్యార్థులు పాల్గొన్నారు.


జ్యోతి ప్రజ్వలన చేసి సీఎంఈని ప్రారంభిస్తున్న సిద్ధార్థ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏడుకొండలరావు

సిద్ధార్థ వైద్య కళాశాలలో సీఎంఈ ప్రారంభం

మాచవరం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని అన్ని మెడికల్ కళాశాలల నుంచి పల్మనరీ మెడిసిన్ పీజీ (పోస్టు గ్రాడ్యుయేట్) విద్యార్థులకు విజయవాడ సిద్ధార్థ వైద్య కళాశాలలో రెండ్రోజులు పాటు సీఎంఈ ప్రారంభమైంది. ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ యదుకొండలరావు శనివారం జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. రాష్ట్రం నలుమూలల నుంచి సుమారు 100 మంది పల్మనరీ మెడిసిన్ పీజీ విద్యార్థులు పాల్గొంటారు. డాక్టర్ సుదీనా, విద్యార్థులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ

పారిశ్రామిక సేవలపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలి

● డీఐఈపీసీ సమావేశంలో కలెక్టర్ లక్ష్మీశ

కలెక్టరేట్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): పారిశ్రామిక రంగానికి సంబంధించి సమన్వయ శాఖలందించే అన్ని సేవలపై యూజర్లకు పూర్తిస్థాయిలో అవగాహన పెంపొందించాలని, ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌తో పాటు స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లోనూ జిల్లాను అగ్రగామిగా నిలిపేందుకు అధికారులు కృషిచేయాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో కలెక్టర్ లక్ష్మీశ అధ్యక్షతన జిల్లా పరిశ్రమలు, ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ (డీఐఈపీసీ) సమావేశం జరిగింది. తొలుత రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో వ్యాపార అనుకూల వాతావరణాన్ని ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వ డిపార్ట్‌మెంట్ ఫర్ ప్రమోషన్ ఆఫ్ ఇండస్ట్రీ అండ్ ఇంటర్నల్ ట్రేడ్ (డీపీఐఐటీ) నిర్వహించే బీఆర్‌ఏపీ-2024 సర్వేపై పారిశ్రామిక వర్గాలకు అవగాహన కల్పించారు. రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు ర్యాంకింగ్స్ ఇచ్చే విధానాన్ని, పరామితులను క్షుణంగా వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ ర్యాంకింగ్‌ను మెరుగుపరిచేందుకు వీలుగా ప్రతి శాఖ తమ శాఖ ద్వారా సేవలు పొందిన వారికి సింగిల్ విండో వ్యవస్థతో పాటు వివిధ ఆన్‌లైన్ సేవలు వంటి వాటిపై పూర్తిస్థాయిలో అవగాహన పెంపొందించాలన్నారు. వివిధ అనుమతులకు సంబంధించి ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి ఆగస్టు 29 వరకు సింగిల్ డెస్క్ పోర్టల్‌లో 2,598 దరఖాస్తులు రాగా 2,921 దరఖాస్తులు పరిష్కారమయ్యాయని, మిగిలిన వాటిని నిర్దేశ గడువులోగా పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. రైజింగ్ అండ్ యాక్సిలరేటింగ్ ఎంఎస్ఎంఈ పెర్ఫార్మెన్స్ (ర్యాంప్)కు సంబంధించి మండల ప్రధాన కేంద్రాల్లో షెడ్యూల్ ప్రకారం ఉద్యమ్ రిజిస్ట్రేషన్ వర్క్‌షాప్‌లను నిర్వహించాలని కలెక్టర్ లక్ష్మీశ ఆదేశించారు. జిల్లా పరిశ్రమల అధికారి ఆర్ వెంకటరావు, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ కే బాబ్జి, ఎల్‌డీఎం కే ప్రియాంక, పీసీబీ ఈఈ పీ శ్రీనివాసరావు వివిధ శాఖల అధికారులు, పారిశ్రామిక అసోసియేషన్ల ప్రతినిధులు, సర్వీస్ యూజర్లు పాల్గొన్నారు.

రాజధాని నిర్మాణంలో నిబంధనలు పాటించాలి

● సీఆర్‌డీఏ కమిషనర్ కన్నబాబు ● అమరావతిలో హెచ్ఎస్ఈఎం వర్క్‌షాప్ విజయవంతం

కలెక్టరేట్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): రాజధాని నిర్మాణంలో వరల్డ్‌బ్యాంక్, ఆసియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ వంటి అంతర్జాతీయ ఫండింగ్ సంస్థల నిబంధనలు, ప్రమాణాలను తప్పనిసరిగా పాటించడం ఎంతో కీలకమని సీఆర్‌డీఏ కమిషనర్ కే కన్నబాబు అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ (సీఆర్‌డీఏ) ఆధ్వర్యంలో ఆగస్టు 29,30న 'నిర్మాణ ప్రాజెక్టుల్లో ఆరోగ్య భద్రత, పర్యావరణ అంశాల నిర్వహణ (హెచ్ఎస్ఈఎం)'పై అమరావతిలోని ఎస్ఆర్ఎం వర్సిటీలో జరిగిన ఎగ్జిక్యూటివ్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం శనివారం విజయవంతంగా ముగిసింది. హైదరాబాద్‌లోని నిక్‌మార్ వర్సిటీతో సీఆర్‌డీఏ అధికారులు సంయుక్తంగా నిర్వహించారు. అమరావతిని ప్రపంచస్థాయి రాజధానిగా నిర్మించే కృషిలో భాగంగా ఇంజినీర్లు, కాంట్రాక్టర్లు, కన్సల్టెంట్లు తదితర భాగస్వాములకు నైపుణ్య వృద్ధిని అందించే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. సీఆర్‌డీఏ కమిషనర్ కే కన్నబాబు ముఖ్య అతిథిగా 165 మందికి పైగా అధికారులు పాల్గొన్నారు. వారిలో సీఆర్‌డీఏ అధికారులు, సిబ్బంది, ప్రోగ్రాం మేనేజ్‌మెంట్ కన్సల్టెన్సీ, ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ కన్సల్టెన్సీల సిబ్బంది, రాజధాని పనులు చేపట్టిన కాంట్రాక్టర్లు ఉన్నారు. అనంతరం వారంతా భద్రతా ప్రతిజ్ఞ చేశారు. కమిషనర్ కన్నబాబు మాట్లాడుతూ సమగ్రమైన శిక్షణ షెడ్యూల్ రూపకల్పనలో కీలకపాత్ర పోషించిన నిక్‌మార్ యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ ఎగ్జిక్యూటివ్ ఎడ్యుకేషన్ డీన్ డాక్టర్ సర్బేష్ మిశ్రాకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే వర్క్‌షాప్ నిర్వహణకు సహకరించిన ఎస్ఆర్ఎం వర్సిటీ యాజమాన్యానికి ధన్యవాదాలు తెలిపారు. రెండు రోజుల కార్యక్రమంలో హెచ్ఎస్ఈకి సంబంధించిన చట్టపరమైన, నియంత్రణాత్మక ఫ్రేమ్‌వర్క్, మేనేజ్‌మెంట్ సిస్టమ్ అభివృద్ధి, భద్రతా ప్రమాణాలు, అత్యవసర పరిస్థితులను సమర్థవంతంగా నిర్వహించే విధానం తదితర అంశాలపై శిక్షణ శిబిరం నిర్వహించారు. డాక్టర్ సర్బేష్ మిశ్రా, ఎం కామరాజన్, ప్రొఫెసర్ విష్ణు నంబూద్రి, ఇండస్ట్రీ రిలేషన్స్ ఆఫీసర్ ఎస్‌వీఎస్ శ్రీకర్ ఈ అంశాలపై సెషన్లను నిర్వహించారు. అమరావతి అభివృద్ధి ప్రాజెక్టులో పాల్గొనే ప్రతి ఒక్కరి ఆరోగ్య భద్రత, పని ప్రాంతాల్లో సమగ్రమైన భద్రత, పర్యావరణ సహితంగా ప్రాజెక్ట్ నిర్వహణ ప్రధాన లక్ష్యాలుగా కొనసాగుతాయని సీఆర్‌డీఏ మరోసారి స్పష్టం చేసింది.



వర్క్‌షాపులో పాల్గొన్న సీఆర్‌డీఏ కమిషనర్ కన్నబాబు

నిక్‌మార్ సంస్థ నేపథ్యం

హైదరాబాద్‌లోని నిక్‌మార్ వర్సిటీ (గతంలో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ మేనేజ్‌మెంట్ రీసెర్చ్‌గా వ్యవహరించేవారు) దేశంలో అగ్రగామి విద్యా సంస్థల్లో ఒకటి. నిర్మాణ కార్యకలాపాల నిర్వహణ, ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్, ఫెసిలిటీస్ మేనేజ్‌మెంట్, హెల్త్-సేఫ్టీ-ఎన్విరాన్‌మెంట్ మేనేజ్‌మెంట్ రంగాల్లో నాణ్యమైన విద్య, పరిశోధన అందించడం సంస్థ ప్రధాన లక్ష్యం.


వినాయకుడిని దర్శించుకుంటున్న మంచు మనోజ్

పర్యావరణాన్ని పరిరక్షించాలి

● హీరో మంచు మనోజ్

విద్యాధరపురం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని హీరో మంచు మనోజ్ అన్నారు. విద్యాధరపురం లేబర్ కాలనీ గ్రౌండ్‌లో డూండీ గణేష్ సేవా సమితి నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని ఏర్పాటు చేసిన 72 అడుగుల మట్టి వినాయకుడి విగ్రహాన్ని శనివారం ఆయన దర్శించుకున్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ఆయనకు స్వాగతం పలికి వినాయకుడి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించి వినాయకుడి ఆశీస్సులు అందించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ తాను మూడేళ్ల పాటు శ్రమించి తీసిన మిరాయ్ చిత్రం ఈనెల 12న విడుదలవుతుందని, ఈ చిత్రాన్ని ప్రేక్షకులు విజయవంతం చేయాలని కోరారు. కాగా, రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్య, పలువురు ప్రముఖులు వినాయకుడి విగ్రహాన్ని దర్శించుకున్నారు. డూండీ సేవా సమితి వ్యవస్థాపకుడు డూండీ రాకేష్, సేవాసమితి సభ్యులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మహిళలను గౌరవించాలి

వన్‌టౌన్: ప్రతి ఒక్కరూ మహిళలను గౌరవించాలని హీరో మంచు మనోజ్ అన్నారు. శనివారం తుమ్మలపల్లి కళాక్షేత్రంలో స్టూడెంట్ ట్రైబ్ ఆధ్వర్యంలో జరిగిన విద్యా సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఒక్కరిలో హీరో ఉంటాడని, ఆ హీరోను మేల్కొలిపితే అద్భుతాలతో పాటు ఉన్నత శిఖరాలు అధిరోహిస్తారన్నారు. ప్రతిభ గల విద్యార్థులను ప్రోత్సహిస్తానని, కులాలను రూపుమాపాల్సిన బాధ్యత నేటితరంపై ఉందన్నారు. అనంతరం విద్యార్థినికి ఉచితంగా ల్యాప్‌టాప్‌ను అందజేశారు.

క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాం

● శాప్ చైర్మన్ రవినాయుడు

విజయవాడ స్పోర్ట్స్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం క్రీడాకారులను గౌరవిస్తూ విశాఖపట్టణంలోని ఏయూ కన్వెన్షన్ హాల్‌లో 2వేల మంది క్రీడాకారులతో జాతీయ క్రీడాదినోత్సవాన్ని ఘనంగా నిర్వహించామని శాప్ చైర్మన్ రవినాయుడు తెలిపారు. శాప్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన క్రీడాకారులు, శాప్ అధికారులు, సిబ్బంది, కోచ్‌కు అభినందనలు తెలిపారు. అనంతరం మాట్లాడుతూ గతంలో స్పోర్ట్స్ డేను తూతూమంత్రంగా డీఎస్ఏల్లో ర్యాలీలు చేసి నిర్వహించేవారని, ఈ ఏడాది మంత్రి లోకేశ్ ముఖ్య అతిథిగా జాతీయ, అంతర్జాతీయ క్రీడా ప్రముఖ ఆధ్వర్యంలో నిర్వహించామన్నారు. స్పోర్ట్స్ డేలో భాగంగా అమరావతి చాంపియన్‌షిప్ పేరుతో రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించి 24,121 మంది క్రీడాకారులను భాగస్వామ్యం చేశామని, వచ్చే ఏడాది 3లక్షల మందిని భాగస్వామ్యం చేయాలని నిర్ణయించామన్నారు. గత వైసీపీ ప్రభుత్వం బకాయి పెట్టిన రూ.16కోట్లు ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. అమరావతి చాంపియన్‌షిప్‌లో విజేతలకు రూ.33కోట్ల నగదు ప్రోత్సహకాలు అందజేశామన్నారు. మెగా డీఎస్సీకి సంబంధించిన 421 పోస్టులు స్పోర్ట్స్‌కు కేటాయించారని, దరఖాస్తు చేసుకున్న వారిలో 870కి పైగా ఫేక్ సర్టిఫికెట్లు వచ్చియని వాటిపై చర్యలు తీసుకుంటామన్నారు. ఫేక్ సర్టిఫికేట్లు జారీ చేసిన అసోసియేషన్లపై కేసులు తప్పవన్నారు. ఈ సమావేశంలో శాప్ డైరెక్టర్లు పాల్గొన్నారు.

మహిళలూ.. ఆభరణాల విషయంలో జాగ్రత్త!

● గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ గ్రహీత తుషార్ అగర్వాల్



లబ్బీపేట, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): మహిళలు బంగారు ఆభరణాలను దాచుకునే విషయంలో జాగ్రత్త వహించాలని గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ గ్రహీత తుషార్ అగర్వాల్ సూచించారు. ఫిక్కి ఫ్లో విజయవాడ చాప్టర్ ఆధ్వర్యంలో బందర్‌రోడ్డులోని ఒక హోటల్‌లో శనివారం బంగారు ఆభరణాలు, వాటి భద్రత, కొనుగోలు విధానం అనే అంశాలపై అవగాహన సదస్సు జరిగింది. తుషార్ అగర్వాల్ పాల్గొని మాట్లాడుతూ ప్రస్తుత తరుణంలో బంగారానికి ఎంతో విలువ ఉందని, బంగారం కొనుగోలు ద్వారా భవిష్యత్తులో రెట్టింపు అవుతుందన్నారు. కొంతమంది మహిళలు బంగారు కొనుగోళ్లలో అజాగ్రత్తగా ఉంటారని తద్వారా నష్టపోయే అవకాశం ఉందని, బంగారు వెండి వజ్రాభరణాలకు విలువ ఎప్పటికీ తగ్గదని, ధరలు తక్కువ ఉన్నప్పుడు కొనుగోలు చేసి భద్రపరుచుకోవాలన్నారు. బంగారు వజ్రాభరణాలు దాచేటప్పుడు జరిగే పొరపాట్ల వల్ల వాటి ఆకర్షణ తరిగిపోతుందని, సురక్షితమైన ప్రదేశంలో భద్రపరచాలని సూచించారు. ఈ సదస్సులో ఫిక్కి ఫ్లో విజయవాడ చాప్టర్ చైర్ పర్సన్ అమిత కుమారి, చాప్టర్ సీనియర్ చైర్‌పర్సన్ సుప్రియ మలినేని, రజనీ చిత్ర, సుమ అట్లూరి, దీప్తి చలసాని, తులజా దేవినేని పాల్గొన్నారు.

దాడి కేసుకు కులం రంగు!

● తోట్లవల్లూరు పోలీస్‌స్టేషన్ వద్ద ఎస్సీల ఆందోళన ● గోపీపై ఫిర్యాదు ● ఎస్సైని సస్పెండ్ చేయాలని డిమాండ్

తోట్లవల్లూరు, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): యాకమూరులో ఉప్పు గోపీ (27) అనే వ్యక్తిపై ఈ నెల 27న రాత్రి జరిగిన దాడి ఘటన, బాధితుడి ఫిర్యాదు మేరకు ఐదుగురు ఎస్సీ యువకులపై పోలీసులు నమోదు చేసిన కేసు తదనంతర పరిణామాలు కుల రంగు పులుముకున్నాయి. యాకమూరు దళితవాడకు చెందిన ఎస్సీ యువకులు తోకల వెంకటవంశీ, తోకల కార్తీక్, మోదుగు వెంకట వరప్రసాద్, రేమల్లి అమర్‌కుమార్, జల్లి ఆకాష్‌ను శుక్రవారం ఉదయం పోలీసులు అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తీసుకు వచ్చారు. దాంతో శుక్రవారం రాత్రి మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు మువ్వల అన్వేష్, గరికపర్రుకు చెందిన కృష్ణబాబు తదితర ఎస్సీ ప్రతినిధులు, ఎస్సీలు తోట్లవల్లూరు పోలీస్‌స్టేషన్ వద్ద ఆందోళన నిర్వహించారు. గ్రామానికి రాకుండా, విచారణ చేయకుండా ఐదుగురు ఎస్సీ యువకులను స్టేషన్‌కు తీసుకు వచ్చి థర్డ్ డిగ్రీ ప్రయోగిస్తారా అంటూ ఎస్సైపై వాదనకు దిగారు. దీంతో సీఐ వై చిట్టిబాబు స్టేషన్‌కు వచ్చి ఆందోళనకారులతో చర్చించారు. ఎస్సైను సస్పెండ్ చేయాలని, ఉప్పు గోపీపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని ఎస్సీ యువకులు సీఐ చిట్టిబాబుకు 2 ఫిర్యాదులు అందించారు.


తన నైటీ చించేశారని చెబుతున్న గోపీ అక్క

అసలేం జరిగింది..?

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం లారీడ్రైవరుగా పనిచేసే గోపీ 6 నెలల క్రితం యాకమూరు వచ్చి అద్దెకు నివసిస్తున్నాడు. 27న రాత్రి ఉప్పు గోపి పాలు తీసుకుని శ్మశానవాటిక రోడ్డు నుంచి ఇంటికి వస్తున్నాడు. అదే సమయంలో ఐదుగురు యువకులు శ్మశానవాటిక వద్ద కూర్చుని మందు సేవిస్తూ గోపీని ఎక్కడ నుంచి వస్తున్నావని ప్రశ్నించారు. పాలు తీసుకు వస్తున్నానని, ఇక్కడ అద్దెకుంటున్నానని చెప్పాడు. ఈ సందర్భంగా వాదన పెరగటంతో గోపీని ఆ ఐదుగురు యువకులు కొట్టారని, తప్పించుకుని ఇంటికి వెళితే ఇంటిపైకి వచ్చి మళ్లీ కొట్టారని, అడ్డు వచ్చిన గోపీ అక్క భవానీతో అసభ్యకరంగా ప్రవర్తించి నైటీని చించేశారని, తమ విచారణలోనూ అదే తేలిందని ఎస్సై అవినాష్ తెలిపారు. గోపీపై దాడికి బాధ్యులైన యువకులపై బెయిల్‌బుల్ సెక్షన్ల కింద కేసు నమోదు చేశామని ఎస్సై సీహెచ్ అవినాష్ తెలిపారు. అయితే ఎస్సీ శ్మశానవాటిక వద్ద కూర్చున్న తమ యువకులపై ఉప్పు గోపీ దురుసుగా ప్రవర్తించి దాడికి పాల్పడ్డాడని ఎస్సీ నేతలు చెపుతున్నారు. అయితే గోపీకి మాత్రమే తీవ్ర గాయాలయ్యాయని, ఎస్సీ యువకులకు ఎలాంటి గాయాలు కాలేదని, ఐదుగురిపై ఒక్క వ్యక్తి దాడికి పాల్పడటమనేది నిజం కాదని, గతంలో వీరి మధ్య ఎలాంటి వివాదాలు లేవని ఎస్సై తెలిపారు. శనివారం ఎస్సీ నేతలు ఈ అంశంపై ఉయ్యూరు ఆర్డీవోకి, గుడివాడ డీఎస్పీకి ఎస్సై అవినాష్‌పై ఫిర్యాదు చేశారు.

విశాల్ మార్ట్‌లో అగ్నిప్రమాదం

● సెల్లార్లో ఎలక్ట్రికల్ ప్యానల్ నుంచి చెలరేగిన మంటలు ● పరుగులు తీసిన ప్రజలు, త్రుటిలో తప్పిన ప్రమాదం

గుణదల, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ఎలక్ట్రికల్ ప్యానల్ నుంచి ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో గుణదల విశాల్ మెగామార్ట్ వద్ద గందరగోళ వాతావరణం నెలకొంది. గుణదల వంతెన సెంటర్ వద్ద ఉన్న విశాల్ మెగా మార్ట్ సెల్లార్ నుంచి శనివారం సాయంత్రం చెలరేగిన మంటల కారణంగా దట్టమైన పొగ మార్ట్‌లోకి ప్రవేశించింది. దీంతో ప్రజలంతా ఒక్కసారిగా భయంతో బయటికి పరుగులు తీశారు. సమాచారం అందుకున్న మాచవరం సీఐ ప్రకాష్, అగ్నిమాపక సిబ్బంది కొద్దిసేపటికే అక్కడికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ప్రమాదం జరిగిన క్షణాల వ్యవధిలోనే ప్రజలు బయటికి పరుగులు తీయడం, అగ్నిమాపక సిబ్బంది వెంటనే వచ్చి మంటలను అదుపుచేయడంతో పెనుప్రమాదం తప్పినట్లయింది. ముందుగా విద్యుత్ నిలిపివేయడంతోచాలా వరకు ప్రమాద తీవ్రత తగ్గిపోయింది. సెల్లార్లో విశాల్ మార్ట్‌కు సంబంధించిన ఎలక్ట్రికల్ ప్యానల్స్ నుంచి మంటలు చెలరేగినట్టు సిబ్బంది గుర్తించారు. సెల్లార్లో పార్క్‌చేసిన ద్విచక్రవాహనాలు కొంతమేర కాలిపోయాయి. దీంతో రూ.5లక్షల వరకు ఆస్తి నష్టం ఉంటుందని, మంటలు మార్ట్‌లోకి ప్రవేశిస్తే ఆస్తినష్టం తీవ్రంగా ఉండేదన్నారు. ఎలాంటి ప్రాణాపాయస్థితి లేకుండా మంటలు అదుపులోకి రావడంతో పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది, మార్ట్ ఉద్యోగులు ఊపిరి పీల్చుకున్నారు. మార్ట్ యాజమాన్యం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మాచవరం సీఐ ప్రకాష్ తెలిపారు.



మంటలు చెలరేగడంతో బయటికి పరుగులు తీస్తున్న ప్రజలు

అధిక వర్షాల వల్ల నేడు కృష్ణా ఎక్స్‌ప్రెస్ రద్దు

రైల్వేస్టేషన్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ డివిజన్‌లోని బికనూరు, తలమళ్ల స్టేషన్ల మధ్య అధిక వర్షాల కారణంగా రైల్వే ట్రాక్‌పై నీరు పారుతున్నందున ఈనెల 30, 31న కొన్ని రైళ్లను రద్దు చేసినట్లు సౌత్ సెంట్రల్ రైల్వే సీపీఆర్‌వో ఏ శ్రీధర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కాగా, 17405 తిరుపతి - ఆదిలాబాద్ కృష్ణా ఎక్స్‌ప్రెస్ ఆదివారం నాడు రద్దు చేసినట్టు తెలిపారు.

రాధాకృష్ణన్ పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

గవర్నర్‌పేట, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జాతీయ స్థాయి ఉపాధ్యాయరత్న, రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలకు ప్రతిభ గల ఉపాధ్యాయుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తునట్టు సామాజిక, సాంస్కృతిక, సాహిత్య సేవా సంస్థ ఆల్ ది బెస్ట్ ఆర్ట్స్ అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షుడు లయన్ డాక్టర్ ఈఎస్ఎస్ నారాయణ మాస్టారు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉపాధ్యాయుల ప్రతిభను, విద్యా సేవా నిరతిని గుర్తించి టీచర్స్ డే పురస్కరించుకుని సెప్టెంబరు 7న హైదరాబాద్‌లో ఘనంగా సత్కరించి పురస్కారాలు అందజేస్తామన్నారు. దరఖాస్తుతో పాటు విద్యార్హతలు, బోధన అనుభవాలు పత్రికల క్లిప్పింగ్స్, గత అవార్డులు, 4 ఫొటోలు జతచేసి సెప్టెంబరు 4లోపు కార్యాలయానికి పంపాలన్నారు.

గుడివాడ - పామర్రు

● గుడ్లవల్లేరు ● నందివాడ ● పెదపారుపూడి ● మొవ్వ

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	118, 126, 137
చికెన్ విత్ స్కిన్	224
చికెన్ స్కిన్‌లెస్	234

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 560

బృందగానం పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



గుడివాడ, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): ఇటీవల భారత్ వికాస్ పరిషత్ నిర్వహించిన జాతీయ బృందగాన పోటీల్లో హిందీ భాషలో గానం చేసిన విద్యా వికాస్ విద్యార్థులు తృతీయ స్థానం సాధించారని పాఠశాల డైరెక్టర్ కొమ్మినేని సాంబశివరావు తెలిపారు. శనివారం స్థానిక పాఠశాల ఆవరణలో బహుమతులు పొందిన విద్యార్థులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు చాట్రగడ్డ నాగమల్లేశ్వరరావు, హిందీ ఉపాధ్యాయురాలు షమీమున్నీసా పాల్గొన్నారు.

విఘ్నేశ్వర నమోస్తుతే..

- గుడివాడ, పామర్రు నియోజకవర్గాల్లో ఘనంగా వినాయక నవరాత్రులు
- వివిధ రూపాల్లో దర్శనమిస్తున్న గణేశుడు
- మేళతాళాలతో నిమజ్జనోత్సవం



తోట్లవల్లూరులో గణపతి ఊరేగింపులో భారీగా పాల్గొన్న భక్తులు



కూచిపూడిలో గణనాథుని సన్నిధిలో కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు

గుడివాడ, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): స్థానిక మెయిన్‌రోడ్డులోని శ్రీవిఘ్నేశ్వరస్వామి దేవస్థానంలో ఏర్పాటు చేసిన మండపంలో శనివారం వీరగణపతి అలంకారంలో స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన కార్యనిర్వహణ అధికారి యార్లగడ్డ శ్రీనివాసరావు(వాసు), ధర్మకర్తల కమిటీ చైర్మన్ సాయన రాజేష్, సభ్యులు లోయ వాసు, ముళ్లపూడి రమణమూర్తి, విక్కుర్తి పోతురాజు, పంచుమర్తి శ్రీనివాసరావు, శారద, శైలజ, విజయలక్ష్మి, కనకదుర్గా భవానీ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న శ్రీకృష్ణ తులాభారం నాటకం

స్థానిక 35వ వార్డు, జి.వి.ఆర్ స్ట్రీట్‌లో శ్రీగణపతి ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేశ్ విగ్రహం వద్ద శనివారం నిర్వహించిన శ్రీకృష్ణతులాభారం పౌరాణిక పద్య నాటకం ఆకట్టుకుంది. రాష్ట్ర సృజనాత్మక, సంస్కృతి సమితి, విజయవాడ సౌజన్యంతో గుడివాడ శ్రీవిమల నాట్యమండలి నేతృత్వంలో ఎస్.కోటేశ్వరీ ఆధ్వర్యంలో ప్రదర్శించారు. ప్రధాన పాత్రధారులుగా పుప్పాల రంగారావు, బి.నాగలక్ష్మి, గంధం రాజేశ్వరీ, జి.శివకుమారి, బి.శోభారాణి నటించారు. మాజీ కౌన్సిలర్ గోకరకొండ బలరాం పాల్గొని ప్రసంగించారు.

భక్తిశ్రద్ధలతో కుంకుమార్చన

కూచిపూడి, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి నవరాత్రులను పురస్కరించుకుని కూచిపూడిలో మహిళలు పెద్ద ఎత్తున కుంకు మార్చనలు నిర్వహించారు. చినముత్తేవి, మొవ్వ, కూచిపూడి, నిడుమోలు, పెదపూడి, కాజ, కోసూరు గ్రామాల్లో ప్రత్యేకంగా అలంకరించిన చలువ పందిళ్లలో విశేష పూజలు జరిపారు.

పోలీస్‌స్టేషన్ వద్ద కాపుల ఆందోళన

తోట్లవల్లూరు, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): తోట్లవల్లూరులో శనివారం గణేష్ నిమజ్జనం ఊరేగింపులో డీజే సౌండ్ సిస్టంను పోలీసులు



గుడివాడలో వీరగణపతి అలంకారం



గుడివాడలో శ్రీకృష్ణ తులాభారం నాటకం

అనుమతించకపోవటంతో మహిళలతో సహా 200 మంది కాపులు పోలీస్‌స్టేషన్ వద్ద ఆందోళనకు దిగారు. తమను ఏడాదికొక్కసారి ఆనందంగా వేడుక చేసుకోనివ్వరా అంటు ఎస్సై సీహెచ్ అవినాష్‌ను ప్రశ్నించారు. ఎట్టి పరిస్థితుల్లోను డీజే సిస్టం అనుమతించేదిలేదని ఎస్సై స్పష్టం చేశారు. అన్నిచోట్ల ఇలాగే కట్టడి చేస్తారా అని నిలదీశారు. చివరకు సౌండ్ బాక్సులు తగ్గించి ఊరేగింపు జరుపుకోమని ఎస్సై చెప్పటంతో ఆందోళన విరమించి గణేశ్ ఊరేగింపు చేపట్టారు. మండలంలో శనివారం 11 చోట్ల గణేష్ విగ్రహాల నిమజ్జనం జరిగింది.

విద్యార్థినులకు ఆత్మరక్షణ విద్య అవసరం

● గుడివాడ డీఎస్పీ ధీరజ్ వినీల్



ఆత్మరక్షణ విద్యను ప్రదర్శిస్తున్న విద్యార్థినులు

గుడివాడ, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): విద్యార్థినులకు ఆత్మరక్షణ విద్య అవసరమని డీఎస్పీ ధీరజ్ వినీల్ అన్నారు. శనివారం స్థానిక కేటీఆర్ మహిళా కళాశాల, ఏజేకే మున్సిపల్ ఉన్నత పాఠశాలలో స్వీయ రక్షణ విద్య నిపుణులతో విద్యార్థినులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఆత్మరక్షణలో భాగంగా స్వీయ రక్షణ పద్ధతులపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రమాదకర పరిస్థితులు ఎదురైనప్పుడు ధైర్యంగా ఎదుర్కోవాలని చెప్పారు. విద్యార్థులు ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎటువంటి సమస్య వచ్చిన వెంటనే పోలీసులను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టూటౌన్ సీఐ జె.ఆర్.కె.హనీష్ పాల్గొన్నారు.

తోట్లవల్లూరులో పబ్లిక్ స్థలం సర్వే ప్రారంభం



తోట్లవల్లూరు రాజా వారి సెంటర్‌లో కొలతలు వేస్తున్న రెవెన్యూ సిబ్బంది

తోట్లవల్లూరు, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): తోట్లవల్లూరు బస్టాండ్ సెంటర్‌లో శనివారం రెవెన్యూ, పంచాయతీ సిబ్బంది జమిందారు ఇచ్చిన 36 సెంట్ల పబ్లిక్ స్థలం సర్వేను ప్రారంభించారు. గ్రామానికి చెందిన చింతా రాజా 36 సెంట్ల పబ్లిక్ స్థలం ఆక్రమణలకు గురైందని, దీనిని ప్రజలకు ఉపయోగపడే విధంగా సర్వే చేసి హద్దులు నిర్ణయించాలని అధికారులకు వినతి పత్రం ఇవ్వటంతో సర్వేయర్లు భవాని, ప్రవీణ్ కొలతలు చేపట్టారు. అయితే చాలా ఆక్రమణలకు గురై భవనాలు నిర్మించినట్టు తేలటంతో ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి తదుపరి చర్యలు తీసుకుంటామని భవాని చెప్పారు.

ఎస్సీ,ఎస్టీల అభ్యున్నతికి మరిన్ని చట్టాలు అవసరం

● ఎమ్మెల్యే వర్లకుమార్ రాజా



ఒడిశా సదస్సులో ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా

పామర్రు, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ ఎస్టీల అభ్యున్నతికి మరిన్ని చట్టాలు అవసరమని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా అన్నారు. ఒడిశాలోని భువనేశ్వర్ లోక్ సేవ భవన్‌లో జరుగుతున్న రెండో రోజు జాతీయ ఎస్సీ, ఎస్టీ సంక్షేమ కమిటీ సమావేశంలో శనివారం ఒడిశా ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మజ్జీ, లోకసభ స్పీకర్ డాక్టర్ ఓం బిర్లా, ఒడిశా గవర్నర్ కంభంపాటి హరిబాబు, ఎస్సీ, ఎస్టీ సంక్షేమ కమిటీ జాతీయ చైర్మన్ ఫగన్‌సింగ్ తదితర్లతో కలసి ఎమ్మెల్యే వర్ల పాల్గొన్నారు. ఈ సందర్భంగా కుమార్‌రాజా మాట్లాడుతూ సమాజంలో వెనుబడిన వర్గాల అభివృద్ధి కోసం విద్య, ఉపాధి, నైపుణ్యాభివృద్ధి, సామాజిక న్యాయం వంటివాటిపై ప్రత్యేక దృష్టి సారించాల్సి అవశ్యకత ఉందన్నారు. జాతీయ స్థాయి సదస్సుల్లో స్థానిక సమస్యలను చర్చించడం వల్ల ప్రభుత్వాలు అమలు చేసే సంక్షేమ పథకాల అమల్లో పారదర్శకత ఏర్పడుతుందన్నారు. ఎస్సీ, ఎస్టీ వర్గాల అభివృద్ధి, సంక్షేమంపై వివిధ రాష్ట్రాల్లో అమలు చేస్తున్న విధానాలు, సమస్యల పరిష్కార మార్గాలపై చర్చించినట్లు వివరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు చొరవతో మెగా డీఎస్సీలో నిరుద్యోగ యువత వర్గీకరణ ఆధారంగా ఉద్యోగులు పొందనున్నట్లు తెలిపారు.

పంచాయతీ ఖాతాలకు పింఛను నగదు

గుడ్లవల్లేరు, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : ఎన్టీఆర్ భరోసా పింఛన్ల నగదు మండలంలోని 22 గ్రామ పంచాయతీల ఖాతాల్లో జమ అయ్యాయని ఎంపీడీవో మహ్మద్ ఇమ్రాన్ శనివారం తెలిపారు. మండల పరిధిలో 7,015 మందికి రూ.3,09,38,500 నగదు పింఛన్లుగా ఇస్తున్నట్లు చెప్పారు. సెప్టెంబరు ఒకటవ తేదీ ఉదయం సచివాలయ సిబ్బంది లబ్ధిదారుల ఇళ్ల వద్దే పంపిణీ చేస్తారని ఇమ్రాన్ తెలిపారు.

పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు

పామర్రు, ఆగస్టు30 (ఆంధ్రజ్యోతి): మండలంలో సెప్టెంబరు ఒకటో తేదీన జరిగే ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీకి అవసరమైన ఏర్పాట్లు చేసినట్లు ఎంపీడీవో కాంద్రు జ్యోతి శనివారం తెలిపారు. నూతనంగా మంజూరైన వితంతు మహిళలకు సైతం ఉదయం నుంచి ఇంటింటా పింఛన్లను గ్రామ సచివాలయ ఉద్యోగులు అందజేస్తారని చెప్పారు. ఈ మేరకు గ్రామ సచివాలయ ఉద్యోగులకు దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో గుత్తికొండ కిషోర్ పాల్గొన్నారు.

అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తే చర్యలు : ఏవో



రికార్డులు పరిశీలిస్తున్న ఏవో అనంతలక్ష్మి

గుడివాడ రూరల్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : అధిక ధరలకు పురుగు మందులు, ఎరువులు విక్రయిస్తే షాపుల యజమానులపై కఠిన చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయాధికారి బోలెం అనంతలక్ష్మి హెచ్చరించారు. శనివారం ఎరువుల షాపులను ఏవో అనంతలక్ష్మి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులకు ప్రతీ కొనుగోలుకు రశీదు అందజేయాలని తెలిపారు. ఎవరైనా అతిక్రమించినట్లైతే వారిపై తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. గ్రామాల్లోని రైతులు వచ్చినప్పుడు వారితో మర్యాదగా ప్రవర్తించాలని కోరారు. ప్రతీ ఎకరాకు ఎరువులు, పురుగు మందులు అందేవిధంగా కృషి చేస్తామని తెలిపారు.

ఎంపీడీవో జ్యోతికి అభినందనలు



పామర్రు, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): పామర్రు ఎంపీడీవోగా పనిచేస్తున్న కాంద్రు జ్యోతికి డీఎల్‌డీవోగా పదోన్నతి లభించడంపై పలువురు అభినందనలు తెలియజేశారు. గతేడాది సెప్టెంబరు 24న పామర్రు ఎంపీడీవో ఆమె బాధ్యతలు చేపట్టారు. శనివారం ఎంపీడీవో జ్యోతిని గ్రామ పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు కలసి శుభాకాంక్షలు తెలియజేశారు. దీనిపై ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు హర్షం వ్యక్తంచేశారు.

యూరియా కోసం రైతుల ఆందోళన



వెంట్రప్రగడ గ్రామంలో నిరసన తెలియజేస్తున్న రైతులు

పెదపారుపూడి, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): యూరియా కోసం రైతులు వెంట్రప్రగడ గ్రామంలో శనివారం ఆందోళన నిర్వహించారు. మండలంలోని వెంట్రప్రగడ, మోపర్రు, వింజరంపాడు ఆయకట్టు పరిధిలోని ఆరు వేల ఎకరాల్లోని పంట పొలాలు యూరియా లేక పాడైపోతుందన్నారు. మండలంలో ఐదు సొసైటీలు ఉన్నా ఒక్క సొసైటీలో కూడా యూరియా లేదన్నారు. ప్రైవేట్ వ్యాపారస్థులు యూరియాను అధిక ధరలకు అమ్ముతున్నారని ఆరోపించారు. కాంప్లెక్స్ ఎరువులు కొంటేనే యూరియా అమ్ముతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. యూరియా దొరక్క నానా అవస్థలు పడుతున్నామని తెలిపారు. ప్రభుత్వం వెంటనే రైతులకు సరిపడా యూరియాను సరఫరా చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతులు గొలుసు రామ్మోహన్‌రావు, నగుళ్ల సత్యనారాయణ, వల్లూరి నరసింహారావు, నూకల సాయిబాబు, బొడ్డు వీరయ్య, మండాడ శ్రీనివాసరావు, ఎనికెపల్లి కోటేశ్వరరావు, బుగ్గ శంకరరావు, గొరవ నరసింహారావు పాల్గొన్నారు.

పేకాట ఆడుతున్న 23 మంది అరెస్టు

గుడివాడ రూరల్, ఆగస్టు 30 (ఆంధ్ర జ్యోతి): గుడివాడ రూరల్ మండలం పర్నసా పరిధిలో పేకాట ఆడుతున్న 23 మందిని పోలీసులు అరెస్టు చేశారు. ఎస్ఐ చంటిబాబు మాట్లాడుతూ పర్నాస శివారులో విద్యుత్ ఫ్లడ్ లైట్లలో ఆధునికంగా పేకాట ఆడుతున్నారని అందిన సమాచారం మేరకు సిబ్బందితో కలసి దాడులు నిర్వహించామన్నారు. 23 మందిని అరెస్టు చేశామని తెలిపారు. వారి వద్ద నుంచి రూ.1,72,000 నగదు, ఐదు ద్విచక్ర వాహనాలు, 22 మొబైల్ ఫోన్లు సీజ్ చేశామన్నారు. మండలంలో ఎక్కడైనా పేకాట ఆడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా ఎస్ఐ చంటిబాబు హెచ్చరించారు.

మాతృభాషలోనే విద్యాబోధన జరగాలి

● సాహితీ స్రవంతి అధ్యక్షుడు లంకా



గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సాహితీ స్రవంతి సభ్యులు

గుడివాడ, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): ప్రాథమిక స్థాయి నుంచి యూనివర్సిటీ స్థాయి వరకు మాతృభాషలోనే విద్యాబోధన జరగాలని సాహితీ స్రవంతి అధ్యక్షులు లంకా సురేంద్ర ఆకాంక్షించారు. శనివారం స్థానిక సుందరయ్య భవన్‌లో తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంస్కృతం, హిందీ, ఆంగ్ల భాషలను విద్యార్థులపై బలవంతంగా రుద్దాలని చూడటం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో సాహితీ స్రవంతి కోశాధికారి కోటేశ్వరరావు, సాహిత్యాభిమానులు ఎ.వెంకటేశ్వరరావు, వి.కె.కిషోర్, ఆర్‌సిపి రెడ్డి, కె.సురేష్, కె.టి.గుప్తా, వి.వి.యన్ రాజకుమారి తదితరులు పాల్గొన్నారు.

కర్ల వృద్ధాశ్రమంలో అన్నదానం



గుడివాడ, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లా, ముదినేపల్లి మండలం, పేరూరుకు చెందిన సోమ సత్యనారాయణ, రామలక్ష్మి దంపతుల కుమార్తె సోమ పూజిత జన్మదినం సందర్భంగా శ్రీకృష్ణ యాదవ సేవా సంఘం ఆధ్వర్యంలో స్థానిక కర్ల వృద్ధాశ్రమంలో శనివారం వృద్ధులకు అన్నదానం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ట్రాఫిక్ ఏఎస్ఐ వి.భాగ్యవతి హాజరై అన్నం వడ్డించారు. సంఘం రాష్ట్ర అధ్యక్షులు పుట్టి హరికుమార్, సభ్యులు తాతారావు, మునీంద్ర, కర్ల వృద్ధాశ్రమం నిర్వాహకులు సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలికి వైద్య సహాయం



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వృద్ధురాలితో బీజేపీ నేత రామకృష్ణ

గుడివాడ, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): స్థానిక శాంతి వృద్ధాశ్రమంలో ఉంటున్న వసుమతి అనే వృద్ధురాలు అనారోగ్యంతో ఇబ్బందులు పడుతున్నట్లు సమాచారం అందడంతో బీజేపీ టూటౌన్ అధ్యక్షుడు మాచర్ల రామకృష్ణ(ఆర్‌కె) శనివారం ఆమెను స్థానిక ఏరియా ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. వృద్ధురాలికి సకాలంలో వైద్యం అందడంతో ప్రాణహాని తప్పిందని ఈ సందర్భంగా ఆయన తెలిపారు.

విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలి

గుడివాడ రూరల్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): స్కూల్ కాంప్లెక్స్‌లో నేర్చుకున్న విషయాలు విద్యార్థులకు అర్థమయ్యే విధంగా బోధించాలని ఎంఈవో-1 సిహెచ్.రజని సూచించారు. శనివారం మోటూరు స్కూల్ కాంప్లెక్స్ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్కూల్ కాంప్లెక్స్ శిక్షణా తరగతుల్లో నూతన అంశాలు, ప్రభుత్వం అమలు చేస్తున్న విధానాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	118, 126, 137
చికెన్ విత్ స్కిన్	224
చికెన్ స్కిన్‌లెస్	234

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 560



బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడిగా గూడవల్లి కృష్ణార్జునరావు



పెడన, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడిగా గూడవల్లి కృష్ణార్జునరావు నియమితులయ్యారు. సంఘ జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య నుంచి శనివారం ఆయన నియామకపత్రాన్ని అందుకున్నారు.

విద్యార్థికి పుస్తకాలు అందజేత

చల్లపల్లి, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): కంప్యూటర్ ఇంజనీరింగ్(ఏఐ) తొలి ఏడాది చదువుతున్న వక్కలగడ్డకు చెందిన దాసి చందుబాబు కుమారుడు సిరివెంకట్‌కు పుస్తకాలు, కాలిక్యులేటర్‌ను ఏపీ సచివాలయ న్యాయశాఖ జాయింట్ సెక్రటరీ వెలగలపల్లి వెంకటేశ్వరరావు అందించారు. శనివారం అంబేడ్కర్ విగ్రహం వద్ద కార్యక్రమాన్ని నిర్వహించారు.



టీడీపీ బంటుమిల్లి మండల విస్తృత స్థాయి సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్

రాష్ట్రంలో ప్రజాస్వామ్యబద్ధంగా పరిపాలన

● ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్

బంటుమిల్లి, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అరాచక పాలన అంతమొందాక ప్రజాస్వామ్యబద్ధంగా పరిపాలన సాగుతోందని ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అన్నారు. శనివారం బంటుమిల్లిలోని టీడీపీ కార్యాలయం ఆవరణలో నిర్వహించిన మండల విస్తృతస్థాయి సమావేశంలో నియోజకవర్గ పరిశీలకుడు గొట్టిముక్కల రఘురామరాజుతో కలిసి ఆయన పాల్గొన్నారు. తొలుత ఇటీవల మృతి చెందిన చినతుమ్మిడి సర్పంచ్ ఓవై చలం చిత్రపటానికి నివాళులర్పించారు. వైసీపీ పాలనలో కార్యకర్తలు ఇబ్బంది పడ్డారని, పార్టీ కోసం పని చేసిన ప్రతి కార్యకర్తకు సముచిత స్థానం కల్పిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. బొర్రా కాశీ, కూనపరెడ్డి వీరబాబు, గంధం సత్యనారాయణ, యిల్లూరి లీలాకృష్ణ, నజీర్, అంగర రంగనాథ్, పర్ణం సూర్య ప్రకాశరావు, నూర్, దింటకుర్తి మధుసూదనరావు, బండారు చంద్రశేఖర్, పాలడుగు వెంకటేశ్వరరావు, పాల్గొన్నారు.

మండల కమిటీ ఎన్నికపై కుదరని ఏకాభిప్రాయం

● గ్రామాల వారీగా నాయకుల అభిప్రాయ సేకరణ

విస్తృతస్థాయి సమావేశంలో టీడీపీ మండల కమిటీ ఎన్నికపై పార్టీలో రెండు వర్గాల మధ్య అభిప్రాయ భేదాలు వచ్చాయి. అధ్యక్ష పదవిని కూనపరెడ్డి వీరబాబు, అంగర రంగనాథ్ ఆశించడంతో సభలో కొంత గందరగోళం ఏర్పడింది. దీంతో నియోజకవర్గ పరిశీలకుడు రఘురామరాజు అభిప్రాయ సేకరణ చేశారు. మండలంలోని 21 పంచాయతీలకు చెందిన నాయకులు, కార్యకర్తల అభిప్రాయాలను సేకరించారు. అభిప్రాయాలను నమోదు చేసుకున్నానని వాటిని పార్టీ అధిష్టానానికి తెలియజేస్తానని, అధిష్టానం సూచనతో కమిటీని నియమిస్తామని రఘురామరాజు తెలిపారు.

మంచినీటి సరఫరాలో అక్రమాలు

● మునిసిపల్ ఆదాయానికి గండి

● జనసేన కౌన్సిలర్ మట్టా శివపావని ఆరోపణ



కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహిస్తున్న చైర్‌పర్సన్ కటకం నాగకుమారి

పెడన, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): 'మునిసిపల్ ట్యాంకర్ల ద్వారా ప్రైవేటు వ్యక్తులు, సంస్థలకు మంచినీటిని సరఫరా చేయడంలో అక్రమాలు జరుగుతున్నాయి. ఫలితంగా మునిసిపల్ ఆదాయానికి గండి పడుతోంది. మంచినీటి సరఫరాకు తీసుకుంటున్న డబ్బు మునిసిపల్ ఖాతాకు జమ కావడం లేదు.' అని జనసేన పార్టీ 12వ వార్డు కౌన్సిలర్ మట్టా శివపావని ఆరోపించారు. చైర్‌పర్సన్ కటకం నాగకుమారి అధ్యక్షతన శనివారం మునిసిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహించారు. ఈనెలలో మంచినీటి కోసం ఎన్ని చలానాలు కట్టించుకున్నారని శివపావని ప్రశ్నించగా రెండు కట్టించుకున్నామని అధికారులు బదులిచ్చారు. పలువురికి మంచినీరు అందించి రెండు చలానాలు మాత్రమే వచ్చాయని అధికారులు చెప్పడం శోచనీయమని శివపావని అన్నారు. మునిసిపాలిటీకి సున్నాన్ని సరఫరా చేయాల్సిన బాధ్యత కాంట్రాక్టర్‌ది అయితే సున్నాన్ని మునిసిపల్ వాహనాల ద్వారా ఎందుకు తీసుకొస్తున్నారని అధికారులను శివపావని ప్రశ్నించారు. సున్నం నిల్వ చేసే సదుపాయం ఇక్కడ లేనందున కాంట్రాక్టర్ గోడౌన్ నుంచి మునిసిపల్ వాహనాల ద్వారా తెచ్చుకుంటున్నామని అధికారులు సమాధానమిచ్చారు. ఆశీల పాటల అగ్రిమెంట్ రిజిస్ట్రేషన్, కిస్తీల వసూలులో అధికారులు నిర్లక్ష్య వైఖరి ప్రదర్శిస్తున్నారని 19వ వార్డు కౌన్సిలర్ సిరివెళ్ల జయేష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అజెండాలోని 9 అంశాలను సమావేశం ఏకగ్రీవంగా ఆమోదించింది. కమిషనర్ ఎల్.చంద్రశేఖరరెడ్డి, మేనేజర్ ఎం.రాజా, టీపీవో సుజనకుమారి, సీనియర్ అకౌంటెంట్ అదిలున్నీసా పాల్గొన్నారు.

కళాశాల అభివృద్ధికి కృషి చేయండి

● అవనిగడ్డ ప్రభుత్వ జూనియర్ కాలేజీ అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందితో డీఐఈవో సరళకుమారి



మధ్యాహ్న భోజనాన్ని విద్యార్థులకు వడ్డిస్తున్న డీఐఈవో సరళకుమారి

అవనిగడ్డ, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉత్తీర్ణత శాతంలో మొదటి లేదా రెండో స్థానాల్లో నిలిచే ప్రభుత్వ జూనియర్ కళాశాలను అదే స్థానంలో నిలపడానికి, కళాశాల అభివృద్ధికి అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది కృషి చేయాలని డీఐఈవో సరళకుమారి సూచించారు. శనివారం ఆమె కళాశాలను సందర్శించారు. మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. కళాశాల రికార్డులు పరిశీలించారు. అధ్యాపకులు, కార్యాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ప్రిన్సిపాల్ దొరబాబుకు అందరూ సహకరించాలని, అందరూ కలిసి పని చేసి కళాశాలను ముందుకు తీసుకెళ్లాలని సూచించారు.

రక్తదాన శిబిరం



శిబిరాన్ని ప్రారంభిస్తున్న సీఐ కె.ఈశ్వరరావు, రెడ్‌క్రాస్ జిల్లా కార్యదర్శి భవిరి శంకరనాథ్

చల్లపల్లి, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): చల్లపల్లి రాజా కళాశాల పూర్వవిద్యార్థుల సంఘం(1988-2020) ఆధ్వర్యంలో సంఘ వ్యవస్థాపకుడు, విశ్రాంత ప్రిన్సిపాల్ టి.సాంబశివరావు పుట్టినరోజు సందర్భంగా చంద్ర రాజేశ్వరరావు వికాసకేంద్రంలో శనివారం స్వచ్ఛంద రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. కళాశాల పూర్వవిద్యార్థులు, వివేకానంద డిగ్రీ కళాశాల యువకులు, జర్నలిస్టులు మొత్తం 35 మంది రక్తదానం చేశారు. తహసీల్దార్ డి.వనజాక్షి, సీఐ కె.ఈశ్వరరావు, రెడ్‌క్రాస్ జిల్లా కార్యదర్శి భవిరి శంకరనాథ్ శిబిరాన్ని సందర్శించి రక్తదాతలను అభినందించారు. మచిలీపట్నం పట్టాభి రెడ్‌క్రాస్ బ్లడ్‌బ్యాంకు వైద్య బృందం రక్తాన్ని సేకరించారు. పేరం మధుసూధనరెడ్డి, ఎండీ ఏకే జిలానీ, బీడీఆర్ ప్రసాద్, అడ్డాడ ప్రసాద్‌బాబు, మాలెంపాటి శ్రీను పర్యవేక్షించారు.

పోషకాహారంతో రక్తహీనత నివారణ

ఘంటసాల, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): పోషకాహారాన్ని తీసుకోవడం ద్వారా రక్తహీనతను నివారించుకోవచ్చని అంగన్వాడీ కేంద్రం వద్ద తల్లులకు ఆచార్య ఎన్జీ రంగా అగ్రికల్చర్ కాలేజీ, కమ్యూనిటీ సైన్స్ కాలేజీ విద్యార్థులు సూచించారు. గ్రామీణ అవగాహన పని అనుభవ కార్యక్రమంలో భాగంగా ఘంటసాలపాలెంలో అంగన్వాడీ కేంద్రం వద్ద తల్లులకు అనీమియాపై శనివారం వారు అవగాహన కల్పించారు. రక్తహీనత వల్ల కలిగే సమస్యలు, నివారణ మార్గాలు, చికిత్స గురించి వివరించారు. అంగన్వాడీ టీచర్లు కనకదుర్గ, ఎన్.మానస, ఎం.ఉమాదేవి, జె.రాజ్యలక్ష్మి, పి.హేమలత, విద్యార్థినులు కె.శైలజ, డి.రీనా, ఎం.దేవి శ్రీ, జె.బ్లెస్సీ సోనియా, వైష్ణవి, అన్విక పాల్గొన్నారు.





మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం నుంచి నిమజ్జనానికి తరలివెళ్తున్న మట్టి గణపయ్య, కోడూరు ప్రధాన సెంటర్‌లో నిమజ్జనానికి తరలివెళ్తున్న గణనాథుడు



చల్లపల్లిలో మట్టి వినాయకుడిని నిమజ్జనానికి తీసుకెళుతున్న చిన్నారులు

వైభవంగా నిమజ్జనాలు

మోపిదేవి/కోడూరు/చల్లపల్లి, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): వినాయక నిమజ్జన కార్యక్రమాలను శనివారం వైభవంగా నిర్వహించారు. మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానంలో నాలుగు రోజులుగా విశేష పూజలందుకున్న మట్టి గణనాథుడు మోపిదేవి వార్పు వద్ద ఉన్న కృష్ణానదిలో నిమజ్జనానికి తరలివెళ్లారు. ఆలయ ఈవో దాసరి శ్రీరామ వరప్రసాదరావు పూజలు చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కోడూరు అయ్యప్పస్వామి దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో అయ్యప్ప దేవాలయం వద్ద ఏర్పాటు చేసిన గణనాథుని నిమజ్జనాన్ని నిర్వహించారు. ఉల్లిపాలెం వద్ద కృష్ణానదిలో నిమజ్జనం చేశారు. చల్లపల్లిలో విజయవాడ రోడ్‌లోని అపార్ట్‌మెంట్ల ఎదురుగా ఉన్న ప్రాంగణంలో చిన్నారులు ఏర్పాటుచేసిన మట్టి గణపతి నిమజ్జన కార్యక్రమం సందడిగా నిర్వహించారు. రాముడుపాలెం కృష్ణానదిలో స్వామిని నిమజ్జనం చేశారు.

రాష్ట్రం అభివృద్ధి చెందాలని వినాయకుడిని కోరుకున్నా

● ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్



చినపుల్లపాడులో వినాయకుడికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్

పెడన రూరల్, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో అమరావతి, పోలవరం పనులు త్వరగా పూర్తయ్యి రాష్ట్రం అభివృద్ధి చెందాలని వినాయకుడిని కోరుకున్నానని ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ తెలిపారు. పెనుమల్లి, చినపుల్లపాడు గ్రామాల్లో గణపతి నవరాత్రుల సందర్భంగా శనివారం నిర్వహించిన అన్నసమారాధన కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ఉరివి, చెన్నూరు, నందమూరు, నడుపూరు, లంకలకలవగుంట, కొప్పల్లి, ముచ్చర్ల గ్రామాల్లో గణపతి పందిళ్లలో ఆయన పూజలు చేశారు.

అలరిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు

మచిలీపట్నం టౌన్: నగరంలోని వినాయక చవితి పందిళ్ల వద్ద శనివారం పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. నరసింహనగర్‌లోని విజయ గణపతి పందిరిలో సంపూర్ణ భగవద్గీత పారాయణ చేశారు. పారాయణ చేసిన మహిళలను గోల్డ్ ప్రిన్స్ అధినేత చలమలశెట్టి నరసింహారావు అభినందించారు. ఆర్టీసీ కాలనీలో వినాయక నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్న పందిరిలో దశావతారాల చిత్రాలు అందరినీ ఆకట్టుకుంటున్నాయి. రామానాయుడుపేట సెంటర్ పందిరి వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి.



పూజలు చేస్తున్న మండలి వెంకట్రామ్

లక్ష్మీ గణపతికి ప్రత్యేక పూజలు

చల్లపల్లి: ప్రధాన సెంటర్‌లోని లక్ష్మీగణపతి ఆలయంలో ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తనయుడు మండలి వెంకట్రామ్ ప్రత్యేక పూజలు చేశారు. ట్యాక్సీ ఓనర్స్ డ్రైవర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గణపతి ఉత్సవాల్లో భాగంగా శనివారం ఐదువేల మందికి అన్నసమారాధ చేశారు. కార్యక్రమాన్ని వెంకట్రామ్ ప్రారంభించారు. విశ్రాంత ఆర్డీవో సీతాపతిరావు, టీడీపీ రాష్ట్రనేత కొనకళ్ల బుల్లయ్య, ఉపసర్పంచ్ ముమ్మనేని నాని పాల్గొన్నారు.

కొక్కిలిగడ్డలో..

మోపిదేవి: కొక్కిలిగడ్డలో గణనాథుడిని మండలి వెంకట్రామ్ దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. జడ్పీటీసీ సభ్యుడు మెడబలిమి మల్లికార్జునరావు,సర్పంచ్ దిడ్ల జానకిరాంబాబు, ఎంపీటీసీ సభ్యురాలు దిడ్ల రాణి, టీడీపీ నాయకులు రావి నాగేశ్వరరావు, చందన రంగారావు పాల్గొన్నారు. అన్నదాన కార్యక్రమాన్ని వారు ప్రారంభించారు.

ప్రత్యామ్నాయ ఉపాధి చూపండి



పెడనలో నిరసన ప్రదర్శన చేస్తున్న ఆటో డ్రైవర్లు

పెడన, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): స్త్రీ శక్తి పథకం అమలుచేసి, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తుండడం వల్ల నష్టపోతున్నామని, ప్రభుత్వం ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలు చూపాలని ఆటో డ్రైవర్లు డిమాండ్ చేశారు. సీఐటీయూ అనుబంధ సంస్థ ఆటో వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్లు శనివారం పట్టణంలో నిరసన ప్రదర్శన చేశారు. 'వాహన మిత్ర పథకం కింద లైసెన్స్ కలిగిన ప్రతి ఆటో డ్రైవర్‌కు రూ.25 వేలు ఇవ్వాలి. సబ్సిడీపై పెట్రోలు, డీజిల్, గ్యాస్ సరఫరా చేయాలి. వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలి. ఫిట్‌నెస్, డ్రైవింగ్ లైసెన్స్‌లను పాత పద్ధతిలోనే ఇవ్వాలి.' అని ఆటో డ్రైవర్లు నినాదాలు చేశారు. బస్టాండ్ సెంటర్ నుంచి ప్రారంభమైన ఈ ప్రదర్శన తహసీల్దార్ కార్యాలయం వరకు కొనసాగింది. తహసీల్దార్‌కు వినతిపత్రం ఇచ్చారు.

కొక్కిలిగడ్డ కోదండరామయ్య మృతికి సంతాపం

నాగాయలంక, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): మచిలీపట్నానికి చెందిన కోస్తా రాష్ట్ర ఉద్యమ సారథి, మచిలీపట్నం-రేపల్లె రైల్వే లైను ఉద్యమకర్త కొక్కిలిగడ్డ కోదండ రామయ్య మృతికి ఆంధ్రప్రదేశ్ మత్స్యకారులు, మత్స్యకార్మిక సంఘం సాంస్కృతిక శాఖ రాష్ట్ర కన్వీనర్ నడకుదిటి రాధాకృష్ణమూర్తి సంతాపాన్ని తెలిపారు. కోస్తా రాష్ట్ర ఉద్యమానికి శ్రీకారం చుట్టి కార్యకలాపాలు నడిపిన తొలి వ్యక్తి కోదండరామయ్య అని ఆయన పేర్కొన్నారు. తర్వాత మచిలీపట్నం-రేపల్లె రైల్వే లైను సాధన కోసం కేంద్రానికి ఉత్తరాలు రాసి, ఉద్యమం నడిపారని తెలిపారు.

మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన

ఘంటసాల, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లిలో కూచిపూడికి చెందిన సిలికానాంధ్ర సంజీవని వైద్యాలయం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెగా ఉచిత వైద్యశిబిరానికి శనివారం విశేష స్పందన లభించింది. 140 మందిని డాక్టర్ ఆర్కే శివప్రసాద్, డాక్టర్ లిల్లీపాల్, డాక్టర్ శ్వేత, పవన్‌కుమార్ పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు. టీడీపీ నాయకుడు పరుచూరి సుభాష్ చంద్రబోస్ వైద్యశిబిరాన్ని ప్రారంభించారు. ఆస్పత్రి ఏవో జొన్నలగడ్డ హనుమకుమార్, మేనేజర్ నిమ్మగడ్డ సత్యప్రకాష్, పీఆర్వో తిరుగణేష్, టీడీపీ నాయకులు సూరపనేని శివరామప్రసాద్, యార్లగడ్డ వీరభద్రరావు, మొవ్వ శ్రీరామ్మూర్తి పాల్గొన్నారు.

ఎంఎస్ఎంఈలకు ఉద్యమ్ రిజిస్ట్రేషన్ తప్పనిసరి



మాట్లాడుతున్న జిల్లా పరిశ్రమల కేంద్ర అసిస్టెంట్ డైరెక్టర్ ప్రదీప్ కుమార్

ఘంటసాల, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): 'జిల్లా పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో రాంప్ (ఆర్ఏఎంపి) ద్వారా అందిస్తున్న వివిధ ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకోండి. ఎంఎస్ఎంఈలకు అందించే వివిధ రుణ సదుపాయాలు, సబ్సిడీలను పొందేందుకు ఉద్యమ్ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ తప్పనిసరి. ప్రతీ పారిశ్రామికవేత్త, వ్యాపారవేత్త తమ యూనిట్లకు ఉద్యమ్ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ తప్పనిసరిగా పొందండి.' అని జిల్లా పరిశ్రమల కేంద్ర అసిస్టెంట్ డైరెక్టర్ పి.ప్రదీప్ కుమార్ సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఉద్యమ్ రిజిస్ట్రేషన్ క్యాంపును శనివారం నిర్వహించారు. ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించేందుకు, రాష్ట్ర ప్రభుత్వం వివిధ రాయితీలు అందిస్తోందని ప్రదీప్ తెలిపారు. సూక్ష్మ చిన్న, మధ్య తరహా పరిశ్రమలను ఉద్యమ్ రిజిస్ట్రేషన్ పోర్టల్‌లో నమోదు చేయటం కోసం జిల్లా పరిశ్రమల కేంద్రం ఆధ్వర్యంలో క్యాంపులు నిర్వహిస్తామని ఆయన తెలిపారు. ఎండీవో సుబ్బారావు, పరిశ్రమల ప్రోత్సాహక అధికారి వై.నాగేంద్ర పాల్గొన్నారు.



మునిసిపల్ కమిషనర్ బాపిరాజుకు వినతిపత్రం అందిస్తున్న టీడీపీ నాయకులు

గానుగకొట్టు సెంటర్‌లో అనధికార షాపు ఖాళీ చేయించండి

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): 45వ డివిజన్‌లోని గానుగకొట్టు సెంటర్‌లో అనధికారికంగా నిర్వహిస్తున్న పాత ఇనుప సామాను కొట్టులో పేలుడు జరిగిందని, ఆ షాపును అక్కడి నుంచి ఖాళీ చేయించాలని మునిసిపల్ కమిషనర్ బాపిరాజుకు టీడీపీ నాయకులు, స్థానికులు శనివారం వినతిపత్రం సమర్పించారు. ఆ షాపులో జరిగిన పేలుడు వల్ల ఆ ప్రాంత ప్రజలు భయపడుతున్నారని వారు పేర్కొన్నారు. అనధికారికంగా లైసెన్స్ లేకుండా నడుపుతున్న ఈ షాపును వెంటనే తొలగించాలని వారు కోరారు. వినతిపత్రం అందించిన వారిలో గంజాల రవికుమార్, కె.నాగేశ్వరరావు, వీరమల్లు దామోర్, తోట గోపాలం, బాలకృష్ణ తదితరులు ఉన్నారు.



హెచ్ఎం, పీడీలను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

విద్యార్థులు, పీడీలకు అభినందన

గూడూరు, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): గూడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు స్పోర్ట్స్ ఎక్సలెన్స్ అవార్డు రావడం అభినందనీయమని హెచ్ఎం జి.విజయకుమారి అన్నారు. అవార్డు వచ్చిన సందర్భంగా శనివారం పాఠశాలలో విద్యార్థులను, పీడీలను ఆమె అభినందించారు. హెచ్ఎం విజయకుమారి, పీడీలు మత్తి అరుణ, రాజేష్‌ను ఉపాధ్యాయులు సన్మానించారు.

విద్యాశాఖ ఫైళ్లపై ట్రెయినీ కలెక్టర్ ఆరా

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): ట్రెయినీ కలెక్టర్ ఫర్హీన్ జావెద్ శనివారం డీఈవో కార్యాలయాన్ని సందర్శించారు. డీఈవో రామారావుతో విద్యాశాఖ ఫైళ్లపై చర్చించారు. పాఠశాలల పనితీరు, పోస్టుల వివరాలు, టీచర్ల బదిలీలు, డీఎస్సీ రిక్రూట్‌మెంట్, వివరాలను అడిగి తెలుసుకున్నారు. అసిస్టెంట్ డైరెక్టర్లు, సూపరింటెండెంట్‌లు పాల్గొన్నారు.

ఘనంగా ఫ్రెషర్స్ డే

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): కృష్ణా విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాలలో ఫ్రెషర్స్ డే కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణా వర్సిటీ ఉపకులపతి ఆచార్య కూన రాంజీ మాట్లాడారు. ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విజయకుమారి, రిజిస్ట్రార్ ఎన్.ఉష, డీన్ సుందరకృష్ణ, సత్యసాయి సంస్థల రాష్ట్ర ఇన్‌చార్జి కె.సాయిఅరుణ, జిల్లా అధ్యక్షుడు కె. చంద్రశేఖర్, శ్రీకాకుళం జిల్లా సమన్వయకర్త ఎం.జనార్దనరావు తదితరులు పాల్గొన్నారు.

మహిళపై కత్తితో దాడి

● పరిస్థితి విషమం.. విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తరలింపు

మచిలీపట్నం క్రైమ్, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): పాత కక్షల నేపథ్యంలో ఒక మహిళ కత్తిపోట్లకు గురైన ఘటన ఇనకుదురుపేట పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజుపేటకు చెందిన మహమ్మద్ రసూల్‌కు, నూరి నగర్‌కు చెందిన అస్గర్‌కు పాత కక్షలు ఉన్నాయి. శుక్రవారం రాత్రి వల్లెగూడెం బ్రహ్మంగారి గుడివద్ద వారిద్దరి మధ్య గొడవ జరిగింది. శనివారం నూరినగర్‌లోని అస్గర్ ఇంటికి రసూల్ వెళ్లాడు. అస్గర్ లేకపోవడంతో ఎక్కడున్నాడని తల్లి మీర్జా ఫాతిమాను రసూల్ ప్రశ్నించాడు. నా కొడుకుతో నీకేంపని అని రసూల్‌తో ఫాతిమా వాగ్వివాదానికి దిగింది. దీంతో రసూల్ తన వెంట తెచ్చుకున్న కత్తితో ఫాతిమాపై దాడి చేశాడు. చేతులు అడ్డు పెట్టడంతో తలపై, చేతులపై ఫాతిమాకు గాయాలయ్యాయి. చుట్టుపక్కల వారు మచిలీపట్నం ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమించడంతో విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఇనకుదురుపేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పదవీ విరమణ పొందిన పోలీసులకు ఘన వీడ్కోలు

మచిలీపట్నం క్రైమ్, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): పదవీ విరమణ పొందిన ఎస్సై సుందరరావు, ఏఎస్సైలు కె.వై.ఎస్.శేఖర్, కె.ఎం.ఎం.వర్మను ఎస్పీ ఆర్.గంగాధరరావు సత్కరించి, ఘనంగా వీడ్కోలు పలికారు. అడిషనల్ ఎస్పీ అడ్మిన్ వి.వి నాయుడు, ఏఆర్ డీఎస్పీ వెంకటేశ్వరరావు, స్పెషల్ బ్రాంచ్ సీఐ వి.వెంకటేశ్వరరావు, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ రాఘవయ్య పాల్గొన్నారు. ఎస్పీ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న పి.వి.ఎల్.ఎన్.కుమారి సీనియర్ అసిస్టెంట్ నుంచి ఆఫీస్ సూపరింటెండెంట్‌గా, ఎం.విద్యాసాగర్ జూనియర్ అసిస్టెంట్ నుంచి సీనియర్ ఆఫీస్ అసిస్టెంట్‌గా పదోన్నతులు పొందారు. వీరిని ఎస్పీ అభినందించారు.